WWW.nindam.co.in


తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, అక్టోబర్ 27, 2024 | సంపుటి - 21 | సంచిక 39 | వెల - 7 | పేజీలు - 12

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



పర్యావరణ హితం

## పట్టని పాలకులు

**పెరుగుతున్న పట్టణీకరణతో కాలుష్యం**


**నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలం**

4లో..

**న్యూఢిల్లీ, నినాదం:** పర్యావరణ పరిరక్షణ అన్నది కేవలం నినాదంగా మారింది. ఢిల్లీ విషయమే తీసుకుంటే వాతావరణ కాలుష్యం అరికట్టే చర్యలు కానరావడం లేదు. కోర్టులు మొత్తుకుంటున్నా పట్టింపు లేదు. కాలుష్యం కారణంగా తాను వాకింగ్‌కు కూడా వెళ్లలేక పోతున్నానని సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హం.

## దండుపాళ్యం బ్యాచ్‌లా బిఆర్ఎస్ సోషల్ మీడియా

- కేటీఆర్, హరీష్ రావులకు మతి భ్రమించింది
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్, నినాదం:** బిఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం బ్యాచ్‌లా మారిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టనని హెచ్చరించారు.

4లో..

15 లోగా వినతులు

## సమర్పించాలి

**జర్నలిస్టుల అక్రిడేషన్లపై కమిటీ చర్చ**




**హైదరాబాద్, నినాదం:** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మంజూరికి అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ, ప్రథమ సమావేశం శనివారం, బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ కె .శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

2లో..

శింగనమలలో

## ఘోర రోడ్డు ప్రమాదం

**ఆరుగురు దుర్మరణం**

**అనంతపురం, నినాదం:** అనంతపురం జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద లారీని కారు ఢీకొంది. టైరు పగిలి అదుపుతప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీనీ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా తాడిపత్రిలో నగర కీర్తన వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా అనంతపురానికి చెందిన సంతోష్, షణ్ముక్, వెంకన్న, శ్రీధర్, ప్రసన్న, వెంకీగా గుర్తించారు.



## సన్నవడ్లకు రూ.500 బోనస్ వర్తింపు

- ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు
- మెట్రో మార్గాల విస్తరణకు ఆమోదం
- ఉద్యోగులకు రెండు డిఎల చెల్లింపు
- ములుగులో గిరిజన వర్సిటీకి 211 ఎకరాల భూమి
- గోషామహల్‌లో ఉస్మానియా నిర్మాణం
- పలు నిర్ణయాలకు కేబినేట్ ఆమోదం

వివరాలు 2లో..

# రోడ్డెక్కిన ఖాకీలు

- మొన్న సతులు.. నేడు పతులు • రాజుకుంటున్న ఏక్ పోలీస్ నిప్పు • తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు

## పోలీసుల ఆందోళనల వెనక కుట్రలు





- పోలీస్ ఉన్నతాధికారుల అనుమానం
- ఆందోళనలు చేస్తే కఠిన చర్యలు
- డిజిపి జితేందర్ ప్రకటన విడుదల

2లో..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):** రాష్ట్ర వ్యాప్తంగా ఏక్ పోలీస్ విధానం అమలు కోసం ఏకంగా పోలీసులే రోడ్డెక్కారు. రాష్ట్ర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో పోలీసులు, వారి కుటుంబాలు రోడ్లపై ఆందోళన బాట పట్టడం ఇదే మొదటిసారిగా చెప్పచ్చు. ప్రజల ధన, మాన, ప్రాణాలు రక్షించాల్సిన పోలీసులే రోడ్డెక్కుతున్నారు. నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు,రాస్తారోకోలను అడ్డుకోవాల్సిన పోలీసులే ఆందోళనలు చేపడుతుండటం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ట్రాన్స్‌కోకు గుదిబండగా

## విద్యుత్ బకాయిలు

**బిల్లులు చెల్లించడంలో స్థానిక సంస్థల నిర్లక్ష్యం**

2లో..

**హైదరాబాద్, నినాదం:** మున్సిపల్ పరిధిలో విద్యుత్ బకాయలు చెల్లింపు జరక్క అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో డిస్కంలకు రుణభారం పెరుగుతోంది. కొన్ని మునిసిపాలిటీలుగా మారాక కరెంట్ బిల్లు బకాయిపడితే మరికొన్ని గ్రామపంచాయతీల ఆదాయం లేక బకాయిలను మూటగట్టుకున్నాయి.



## మెఘాకు స్కిల్ వర్సిటీ నిర్మాణ బాధ్యతలు

- నిర్మాణానికి ముందుకు వచ్చిన మెఘా కంపెనీ
- ప్రభుత్వంతో నిర్మాణ సంస్థ ఒప్పందం
- రూ.200 కోట్ల సీఎస్మార్ నిధులతో నిర్మాణం

2

**హైదరాబాద్, అక్టోబర్26(నినాదం):** యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం మరో ముందడుగు పడింది. స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ ముందుకొచ్చింది. యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి రూ.200 కోట్లను మేఘా కంపెనీ కేటాయించింది. యూనివర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను మేఘా కంపెనీ స్వీకరించింది.



ప్రాణహిత నదిలో

## ముగ్గురు గల్లంతు

**సిర్పూర్,అక్టోబర్ 26 (నినాదం):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం బెజ్జూరు మండలంలోని ప్రాణహిత నదిలో శనివారం ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. బెజ్జూరు మండలం గోల్కొండ గ్రామానికి చెందిన జహీర్ హుస్సేన్ (24), ఇర్షాద్ (20), మోసీద్ (22) ఎర్రబండ రేవద్ద ప్రాణహిత నదిలో ఈతకు వెళ్లి గల్లంతయ్యారు. వారితో పాటు ఈతకు వెళ్లిన ఖాసీమ్ తోటి మిత్రులు గల్లంతైన విషయాన్ని కుటుంబీకులకు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. హుటాహుటిన కుటుంబీకులు, కౌటాల సిఐ ఎం. రమేష్, బెజ్జూర్ ఎస్సై విక్రం సంఘటన స్థలానికి చేరుకొని విషయం తెలుసుకున్నారు. గల్లంతయిన యువకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## డిపాజిట్లు హాంఫట్

**'నకిలీ' పుస్తకాలు సృష్టించి నిండా ముంచి**

- బేగంపేట పోస్టాఫీస్ లో భారీ కుంభకోణం
- లక్షలో ఖాతాదారుల డబ్బులు స్వాహా చేసిన బీపీఎం
- ఎస్పీఎం సంతకం ఫోర్జరీ చేసిన వైనం
- లబోదిబోమంటున్న బాధితులు

2







## 15 లోగా వినతులు సమర్పించాలని సూచన

కమిటీ సభ్యులు ఆంధ్రజ్యోతి ఎడిటర్, కె.శ్రీనివాస్ , సియాసత్ న్యూస్ ఎడిటర్, ఎమ్మెల్సీ, అమీర్ అలీ ఖాన్, హిందూ పొలిటికల్ ఎడిటర్, ఆర్ రవికాంత్ రెడ్డి, సీనియర్ ఫోటో జర్నలిస్ట్, కె .నరహరి, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.యస్. జగన్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర హైకోర్టు తీర్పులు, నూతన మార్గదర్శకాలు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ కమిటీ నిబంధనలను, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర మీడియాకు అక్రిడిటేషన్ల అంశాలపై ప్రాథమికంగా చర్చించింది. రాష్ట్రంలో నూతన మార్గదర్శకాలపై జర్నలిస్టు యూనియన్లు/అసోసియేషన్లు, ప్రెస్ క్లబ్బులు, వ్యక్తుల నుండి ప్రత్యేక కమిటీకి రాతపూర్వకమైన సలహాలు, సూచనలను ఆహ్వానించింది. నవంబర్ 15లోగా వాటిని సమాచార పౌర సంబంధాల శాఖ, జాయింట్ డైరెక్టర్‌కు అంద జేయాల్సిందిగా కోరింది.

## ట్రాన్స్‌కోకు గుదిబండగా విద్యుత్ బకాయిలు

వీధి దీపాలు, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్‌ను వాడుకుంటున్నా బిల్లులు చెల్లించడం లేదు. బిల్లుల చెల్లింపు విషయంలో మునిసిపాలిటీలు వ్యవహరిస్తున్న తీరు విద్యుత్ శాఖకు ఇబ్బందికరంగా మారిందని అధికారులు వాపోతున్నారు. దీంతోవిద్యుత్ బకాయిల చెల్లింపులో మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. మున్సిపాలిటీలు ట్రాన్స్‌కోకు చెల్లించాల్సిన బకాయిలు కోట్లలోపేరుకుపోయాయని సమాచారం. కొన్ని మునిసిపాలిటీలు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడం విద్యుత్ శాఖకు భారంగా మారింది. వాటికి ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు రావడం లేదు. దాంతో కార్యాలయాలకు కరెంట్ కట్ కాకుండా చూసుకుంటున్నారు. మిగిలిన వాటికి విద్యుత్ సరఫరా నిలిపి వేసే అవకాశంలేనందున పట్టించుకోవడం లేదు. దీంతో అనేక మునిసిపాలిటీల బకాయిలు కొన్నేళ్ల నుంచి పేరుకుపో యినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

### కమీషన్ల కోసమే

# కాళేశ్వరం నిర్మాణం

అన్నికేసులపైనా విచారణ సాగుతున్నాయి
అవినీతి నేతలను ఎవ్వరినీ వదిలే ప్రసక్తి లేదు
కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంది
కేబినెట్ విస్తరణ అధిష్ఠానం, సిఎం చూస్తారు
త్వరలోనే పార్టీ పునర్వ్యవస్థీకరణ చేపడతాం
మీడియాతో ఇష్టాగోష్ఠిలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్

**న్యూఢిల్లీ,అక్టోబర్26(నినాదం):**
కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారని ప్రపంచానికంతా తెలిసిందని, అందుకే కెసిఆర్ కుటుంబ అవినీతిపై చర్యలకు సర్వత్రా డిమాండ్ పెరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అవినీతి పరులను ప్రభుత్వం వదలబోదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం డిజైన్ మార్చి వ్యయం పెంచారని ఆరోపించారు. కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టారని.. ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవకతవకలపై కమిషన్ విచారణ జరపుతోందని.. కాళేశ్వరం వాస్తవాలు బయటకు రావాలని అన్నారు. అన్యాయంగా ప్రభుత్వం ఎవరిపైన కేసులు పెట్టదని.. అదే విధంగా తప్పు చేసిన ఎవరినీ వదలదని హెచ్చరించారు. రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన కేబినెట్ విస్తరణపై గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. శనివారం మీడియా ప్రతినిధులతో ఇష్టగోష్టిగా మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీ, ముఖ్యమంత్రి కనుసన్నలలో జరుగుతుందని.. తాను పార్టీ వ్యవహారాలు మాత్రమే చూస్తున్నానని అన్నారు. కేబినెట్ విస్తరణ పార్టీ హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. త్వరలో పీసీసీ నూతన కార్యవర్గ నియామకం ఉంటుందని.. డీసీసీలుగా ఎమ్మెల్యేలతో పాటు సమర్థులకు కార్యవర్గంలో స్థానం ఉంటుందని అన్నారు. ఇతర పార్టీల నాయకుల చేరికలతో కొన్ని సమస్యలు తలెత్తాయని.. పాత కొత్త నేతలను సమన్వయం చేసుకోవాల్సి ఉందని అన్నారు. జీవన్ రెడ్డి సన్నిహితుడు మరణంతో మనస్తాపానికి లోనయ్యారని.. బాధతో ఆయన లేఖ రాశారన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడని.. ఆయనకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్రంలో పొలిటికల్ బాంబు పేలుతాయంటూ మంత్రి పొంగులేటి చేసిన కామెంట్స్ స్పందిస్తూ.. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారి గురించే పొంగులేటి మాట్లాడారని భావిస్తున్నానని అన్నారు. అక్కినేని ఫ్యామిలీ, సమంతపై కొండా సురేఖ మాటలను పార్టీ పరంగా సమర్థించమ న్నారు. వెంటనే కొండా సురేఖ తన మాటలు ఉపసంహరించు కున్నారని గుర్తు చేశారు. రానున్న డిసెంబర్ నెలలో కొన్ని శుభవార్తలు వింటారని మహేష్ గౌడ్ అన్నారు. మరోవైపు.. 2029 ఎన్నికలు మాకు ఫైనల్ అని.. రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి ఉంటుందని తెలిపారు. బీసీ విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొంత డివియేట్ అవుతున్నారని.. ఆయనతో నేను, రాష్ట్ర పార్టీ వ్యవహా రాల ఇన్ చార్జ్ దీపదాస్ మున్సి మాట్లాడామని.. అన్ని సర్దుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ కులగణనపై నవంబర్‌లో సమావేశాన్ని నిర్వహించాలని అనుకుంటున్నామని.. ఆ సమావేశానికి మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను ఆహ్వానించామని తెలిపారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని కుమార్ గౌడ్ అన్నారు. వారు చేసిన తప్పులకు కేసీఆర్, కేటీఆర్‌లను రెండు, మూడేళ్లుకాదని.. పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువేనని అన్నారు. అలాగే విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరో పించారు. ఇప్పుడు చాలా తక్కువధరకే విద్యుత్ దొరుకుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన లేదని అన్నారు. కేసీఆర్‌కు ఉన్న ఆర్థిక వెసులుబాటు తమకు లేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంది, కానీ పదేళ్లలో రూ.8లక్షల కోట్లు కేసీఆర్ తెలంగాణపై అప్పు చేశారని విమర్శించారు. ఏ పథకాన్ని ఆపలేదు. త్వరలోనే పథకాలను గ్రౌండ్ చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో విడుతాల వారిగా చేసిన దానికంటే తాము రుణమాఫీ చేసిన మొత్తం ఎక్కువేనని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేసీఆర్ చేసిన అప్పులను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం, పథకాలను ఎగ్గొట్టా లనే ఆలోచన లేదని చెప్పారు. హైడ్రాలో ఒక్కటే పేదల ఇల్లు కూలిందని చెప్పారు. సోషల్ మీడియాలో అనైతికంగా ప్రచారం చేస్తున్నారు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతూ పట్టుకుంద మంటే పట్టుకునే వీలు లేకుండా విదేశాల్లో ఉంటూ నడుపుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో యథేచ్ఛగా చెరువుల కబ్జా జరిగింది. వయనాడులో జరిగిన విధ్వంసం తెలంగాణలో జరగకూడ దనే యుద్ధప్రాతిపదికన మూసీ ప్రక్షాళన చేపట్టాంమని వివరించారు. విడతల వారిగానే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం.హైడ్రాతో పేదవారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటాం. హైడ్రా, మూసీపై రివ్యూ చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి అన్యాయం కలగకుండా చర్యలు ఉంటాయని అన్నారు. జీవో నెంబర్ 29పై ఎవరికి నష్టం జరుగదని అధికారులు చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో ఎవరికి అన్యాయం జరగడం లేదు. జీవో నెంబర్ 29పై ఎవరు ఆందోళన చేశారో, ఎందుకు చేశారో తెలియడం లేదన్నారు. నెలలు అవుతుంది, ప్రతిపక్ష నేత ఎక్కడికి పోయాడు. ప్రజల సమస్యలపై కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు. కేసీఆర్‌కు ప్రజలు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే ఆయన చేస్తున్నది ఏంటని అన్నారు. సీఎం తమ్ముడు తిరుపతి రెడ్డి ఆయన ఇల్లును కూల్చామనే చెప్పారు, కానీ కోర్టు డైరెక్షన్ వల్లే కూల్చలేదు. ప్రభుత్వానికి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు, అదాని ఇచ్చారు అంతే. ప్రతిపక్షాల రాద్ధాంతంతో ప్రజలు ఆందో ళనలో ఉన్నారు, అంతే తప్ప భవిష్యత్ తరాలకోసమే హైడ్రా, మూసీ ప్రక్షాళన అని వివరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రభావం ఉండదు. బీఅర్ఎస్‌లో ఏముందని చేరతారు. కేసీఆర్ కనబ డటం లేదు, ఎవరిని చూసి బీఆర్ఎస్‌లో చేరతారు. ఏ కేసును నీరుగార్చే ప్రయత్నం చేయడం లేదు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, భూ ఆక్రమణలు ఇలా అన్ని కేసుల విచారణ ఉంటుంది, ఫోన్ ట్యాపింగ్ పెద్ద వ్యవహారం. కేంద్రాచట్టలు వర్తిస్తాయి. కేసీఆర్ చేసినట్లు మేము మోసం చేయమనే క్లారిటీతో ప్రజలున్నారు.పార్టీలో ఉన్న నేతలను కాపాడుకునేందుకే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని కొందరు చెప్పుకుంటున్నారు. కేటీఆర్‌తో సన్నిహితంగా ఉన్నవాళ్లే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# పోలీసుల ఆందోళనల వెనక కుట్రలు



**హైదరాబాద్, అక్టోబర్26(నినాదం):**

తెలంగాణ పోలీస్ బెటాలియన్లలో పనిచేసే కానిస్టేబుల్స్ చేస్తున్న ఆందోళనల పైన పోలీస్ శాఖ గుర్రుగా ఉంది. విధులను బహిష్కరిం చటం, రోడ్ల పైకి వచ్చి ఖాకీలే ఆందోళన చేయడం తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనగా పోలీస్ శాఖ భావిస్తోంది. ఈ పరిణామాన్ని ఏమాత్రం లైట్ తీసుకోకూడదని పోలీసు శాఖ నిర్ణయించింది. పోలీసు శాఖలో పనిచేస్తూ జన జీవనానికి ఇబ్బంది కలిగేలా రోడ్లపై వచ్చి ఆందోళన చేస్తున్న పోలీసులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమై నట్లు సమాచారం. పోలీస్ బెటాలియన్ కానిస్టే బుల్స్‌కు సెలవుల విషయంలో పాత పద్ధతిని అనుసరిస్తామని ఇప్పటికే చెప్పినప్పటికీ ఉద్దేశ పూర్వకంగా ఆందోళన చేస్తున్నారని పోలీస్ శాఖ ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో బాధ్యులపై తీవ్రమైన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా నిరసనలకు దిగిన కొంతమందిని పోలీస్ శాఖ ఇప్పటికే గుర్తించింది. కానిస్టేబుళ్ల ఆందోళన వెనుక ప్రభుత్వం అంటే గిట్టని కొన్ని రాజకీయ శక్తుల హస్తముందని పోలీస్ శాఖ అనుమానిస్తోంది. ఈ క్రమంలో బెటాలి యన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనపై తెలంగాణ డీజీపీ జితేందర్ తీవ్రంగా స్పందించారు. క్రమక్షశిణతో కూడిన ఫోర్స్‌లో ఉంటూ ఆందోళనలు చేయడం సరికాద న్నారు. ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళ నకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టే బుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ జితేందర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెల వులపై పాత పద్ధతే అమలు చేస్తామని చెప్పిన ప్పటికీ మళ్లీ ఆందోళనలకు దిగడం సరికాద న్నారు. ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఉన్నాయనే అనుమానం ఉందన్నారు. ఆందోళనలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మన దగ్గర ఉన్న రిక్రూట్‌మెంట్ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని ప్రకటనలో పేర్కొన్నారు.

## రోడ్డెక్కిన ఖాకీలు..

**మొదటిపేజీ తరువాయి**

వరంగల్ జిల్లా మమునూరు క్యాంపులో పోలీసు సతులతో మొదలైన ఆందోళన శనివారం ఏకంగా యూనిఫాం ధరించిన పోలీసులే నిరసనకు దిగారు. టీజీఎస్పీ వద్దు ఏక్ పోలీస్ ముద్దు, టీజీఎస్పీకో హఠావో.. ఏక్ పోలీస్ బనావో అంటూ నినాదాలు చేశారు. అయితే రాష్ట్రంలో తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీసు బెటాలియన్లు 13 ఉన్నాయి. ఒక్కో బెటాలియన్ లో సగటున 15 వందల మంది విధులు నిర్వర్తిస్తారు. ఇందులో 2వందల మంది జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తారు. మిగతా 13వందల మంది బెటా లియన్ పరిధిలోని పోలీసు స్టేషన్లలో రొటేషన్ గా మూడు నెలల పాటు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీళ్లు ఇలా అన్ని పోలీస్ స్టేషన్లకు రొటేట్ అవుతూ ఉంటారు. ఒక్కో కానిస్టేబుల్ ఏడాదిలో కనీసం మూడు పోలీసు స్టేషన్లకు తిరగాల్సి ఉంటుందని ఇలా తిరగడం వల్ల తమ భర్తలు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారని కానిస్టేబుళ్ల భార్యలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఒక్క జిల్లాలో మూడు నుంచి ఐదేండ్ల పాటు పనిచేసేలా వెసులు బాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. మిగతా సివిల్ కాని స్టేబుళ్ల మాదిరిగానే తమకూ సెలవులు, బదిలీలు ఉండే విధానాన్ని తీసుకు రావాలని ఆ కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం వరంగల్ జిల్లా మామునూర్ 4వ బెటాలియన్ కానిస్టే బుళ్ల సతీమణులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్ నినాదంతో రోడ్డుపై బైఠాయించి తమ భర్తలతో వెట్టిచాకిరి చేపి స్తున్నారని, సెలవులు ఇవ్వకుండా కుటుంబా నికి దూరం చేస్తున్నారంటూ ధర్నాకు దిగారు. రెండు రోజులుగా నివురుకప్పిన నిప్పులా ఉన్న ఈ ఆందోళన ఒక్కసారిగా భగ్గుమంది. ఏకంగా కానిస్టేబుళ్లే రోడ్డెక్కి ధర్నా చేపట్టడం, ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్ అమలు చేయాలని డిమాండ్ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



# సన్నవడ్లకు రూ.500 బోనస్ వర్తింపు

**హైదరాబాద్,అక్టోబర్26(నినాదం):**

రాష్ట్రంలో రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సన్న వడ్లకు రూ.500 బోనస్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ధాన్యం సేకరణకేంద్రాల ఏర్పాటకు మంత్రిమం డలి ఆమోదించింది. అలాగే మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగోల్, ఎల్‌బి ఆనగర్, హయత్‌నగర్,శంషాబాద్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల హామీలు సహా మేనిఫె స్టోపై చర్చించింది. ఇప్పటివరకూ వేసిన కేబినెట్ సబ్ కమిటీలు, వాటి నివేదికలపై చర్చించింది. ములుగు జిల్లాలో సమ్మక్క సారలమ్మ సెంట్రల్ వర్శిటీకి ఎకరానికి రూ.250 చొప్పున భూమిని కేటాయించాలని నిర్ణయించింది. అలాగే, మద్దూర్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయడా నికి ఆమోదం తెలిపింది. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంపుపైనా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రేరాలో 54 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీకి ఆదేశాలిచ్చింది. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉస్మానియా ఆస్పత్రి పునఃనిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయిస్తూ నిర్ణయం తీసుకు న్నట్లు సమాచారం. దీపావళి పండుగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండిరగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యో గులకు రెండు డీఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక డీఏ వచ్చే నెల వేతనంతో.. మరో డీఏ మార్చిలో ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. పండుగ వేళ పెండిరగ్‌లో ఉన్న రెండు డీఏ విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీఏల విడుదలతో పాటు ఈ భేటీలో కేబినెట్ మరికొన్ని కీలక నిర్ణ యాలకు ఆమోద ముద్ర వేసింది. ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీకి ఎకరా రూ.250 చొప్పున 211 ఎకరాల భూమి కేటాయింపు, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలా యింపుకు మంత్రి మండలి ఒకే చెప్పింది. దీంతో పాటుగా.. ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్ చేస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. దీంతో ఏటూర్ నాగారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు బాణా సంచాలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఇదిలా వుంటే అటు, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక కొందరు కావాలనే విష ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి మండిపడ్డారు. నరెడ్కో నిర్వ హిస్తోన్న ప్రాపర్టీ షోను శనివారం ఆయన సందర్శించారు. మూసీ నిర్వాసితులకు అద్భుత మైన జీవితాన్ని ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చ యంతో ఉందన్నారు. నిర్వాసితులకు వారు ఉండే చోట అద్భుతమైన టవర్స్ నిర్మించి.. వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని తెలిపారు. మూసీ నిర్వాసిత మహిళలతో పాటు నగరంలోని డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. మరోవైపు, స్థిరాస్తి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్యాంకర్లతో చర్చించి వారికి రుణాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హైడ్రాపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం

## మెఘాకు స్కిల్ వర్సిటీ నిర్మాణ బాధ్యతలు

ప్రపంచ స్థాయి అధునాతన నమూనాలతో అన్ని మౌలిక వసతు లతో స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టేందుకు మేఘా కంపెనీ ముందుకొచ్చింది. సచివాలయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రె డ్డితో మెఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి కంపెనీ ప్రతినిధుల బృందం చర్చలు జరిపారు. సీఎంతో పాటు చర్చల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమ టిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ప్రభుత్వం తలపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకునేందుకు మెఘా కంపెనీ నిర్వాహకులు చర్చలు జరిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణం చేపడుతా మని మేఘా కంపెనీ ప్రకటించింది. యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) మేఘా కంపెనీ చేసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. హైద రాబాద్ శివార్లలో కందుకూరు మండలం మీర్ ఖాన్ పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. అధునాతన బోధన సదుపాయాలతో పాటు విద్యార్థులకు అన్ని వసతులుండేలా క్యాంపస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎస్ఆర్ నిధులతో ఈ క్యాంపస్ నిర్మాణానికి మెఘా కంపెనీ ముందుకు వచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.అకాడమిక్ బిల్డింగ్, వర్క్ షాపులు, తరగతి గదులతో పాటు హాస్టల్ బిల్డింగ్ నిర్మిస్తామని మెఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్‌లతో నిపుణులతో తయారు చేయించిన డిజైన్‌లపై చర్చించారు. వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నవంబర్ 8వ తేదీ నుంచి యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించ దానికి ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం రేవంత్‌రడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.



## తెలంగాణలో ఎక్కడా మంచినీటి సమస్య రావద్దు

**స్వచ్ఛమైన మంచి నీటినే సరఫరా చేయండి**
**మిషన్ భగీరథ నిర్వహణలో లోపాలు రాకూడదు**
**అధికారులతో సమీక్షలో మంత్రి సీతక్క ఆదేశాలు**

హైదరాబాద్ :
తెలంగాణలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్య రానీయ కూడదని మంత్రి సీతక్క ఆదేశించారు. శుద్ధి చేసిన నీరే సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. కోట్లాదిమంది ప్రాణాలు మిషన్ భగీరథ సిబ్బంది చేతిలో ఉన్నాయని.. అందుకే అధికారులు అంతా బాధ్యతతో పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉన్నా ఎలాంటి సమస్య లేకుండా తాగునీటిని అందించామని స్పష్టం చేశారు. 13456 మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చామని గుర్తుచేశారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లాల వారీగా అధి కారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్షా సమావేశం నిర్వ హించారు. జిల్లాల వారీగా గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

# డిపాజిట్లు 'హాంఫట్

**మంథని, అక్టోబర్ 26 ( నినాదం)**



'పొదుపు' తమ భవిష్యత్తుకు మలుపు అవుతుందన్న ఖాతా దారుల ఆశలు గల్లంతయ్యాయి. తపాల శాఖలో స్వాహా పర్వం కలకలం రేపింది. పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేసిన లక్షలాది రూపాయలను బీపీఎం కాజేసి నకిలీ పాసుపుస్తకాలు అంట గట్టిన ఉదంతం పెద్దపల్లి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో ఒకటో, రెండో నకిలీ పాసు పుస్తకాలు కాదు.. లెక్కకు మించి వెలుగు చూశాయి. తమ డబ్బులు బీపీఎం కాజేసిందని తెలిసి బాధితులు లబోదిబోమంటున్నారు. తపాలా శాఖ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. రామగిరి మండలం బేగంపేట పోస్టాఫీసులో నకిలీ పాసు పుస్తకాల వ్యవహారం గుట్టు రట్టయింది. పదుల సంఖ్యలో నకి'లీల' వ్యవహారంలో బీపీఎం హేమలత రూ. లక్షల్లోనే హాంఫట్ చేసింది. భవిష్యత్తు అవసరా లను దృష్టిలో ఉంచుకొని ఖాతాదారులు ఒక్కొకరు రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు బేగంపేట పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్డ్ డిపాజిట్లు చేశారు. కాగా ఎస్పీఎం వద్ద చెల్లించకుండా బీపీఎం ఖాతాదారులకు నకిలీ పాసు పుస్తకాలను అంటగట్టారు. ఇదిలా ఉంటే ఇటీవల కొందరు తమ ఎఫ్.డి సొమ్ము కోసం ఎస్పీఎం వద్దకు పాస్ పుస్తకాలతో వెళ్ళగా అసలు కథ బయటప డిందని సమాచారం. ఒక్క ఎకౌంట్ మీద పదుల సంఖ్యలో నకిలీ పాస్ పుస్తకాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు అధికారులను ఆశ్రయించారు. నకిలీ పాస్ పుస్తకాల్లో ఎస్పీఎం సంతకాన్ని బిపిఎం ఫోర్జరీ చేసినట్లు తెలుస్తోంది.

### విచారణ ప్రారంభం

బాధితుల పిర్యాదు మేరకు శనివారం తపలాధికారి విచారణ చేపట్టారు. లక్షలాది రూపాయలు డిఫాజిట్ చేస్తే నకిలీ పాస్ పుస్తకాలు రసీదు లు ఇచ్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.30 నుండి రూ.50 లక్షల వరకు గల్లంతు అయినట్లు బాధితులు పేర్కొన్నారు. సుమారుగా 50 ఖాతాలు నకిలీగా తయారు చేసినట్టు తపాల అధికారి తెలిపారు. నకిలీ పాసు పుస్తకాలు తయారుచేసి ఫోర్జరీ సంతకం చేసినట్లు బీపీఎం హేమ విచారణలో తెలిపినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని అనంతరం వివరాలు వెల్లడిస్తామని విచారణ అధికారి తెలిపారు. భవిష్యత్తు అవసరాల కోసం పనికి వస్తుందన్న సొమ్మును బీపీఎం హేమ స్వాహా చేయడంతో బాధితులు లబోదిబో మంటు న్నారు. వెంటనే పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమ డబ్బులు తిరిగి వచ్చేలా చేయాలని విచారణ అధికారిని కోరారు.

### మహారాష్ట్ర, జార్ఖండ్

# ఎన్నికలకు దూరం

**- ఆప్ అధినేత కేజ్రీవాల్ నిర్ణయం**

న్యూఢిల్లీ:
హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఖాతా తెరవ డంలో విఫలమైన ఆమ్ ఆద్మీ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించిందని ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ తెలిపారు. మహా వికాస్ అఘాఢీ కూటమిలోని పార్టీలకు మద్దతుగా తమ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. మహారాష్ట్రతో పాటు రaార్ఖండ్ విషయంలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి తీసుకు న్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు మద్దతుగా రaార్ఖండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరనుండగా.. రaర్ఖండ్‌లో 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెలువడను న్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి పోటీగా విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమి స్థాపించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, గుజరాత్, హరియాణా రాష్టాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేసింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం ఒంటరిగా బరిలోకి దిగింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంతంగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైంది. తాజాగా మహారాష్ట్ర, రaర్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా నిలిచింది.

సంపాదకీయం

# ఆర్థిక విధానాలను ఎన్‌డి పక్షాలు చర్చించాలి !

గత దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. ధరలు పెరగడం, పేదలు చితికి పోవడం అన్నది సమాంతరంగా సాగుతోంది. అయినా కిందిస్థాయిలో ఏం జరుగు తున్నదో తెలుసుకోలేక పోతున్నారు. కనీసం ఇప్పటికైనా ఎన్‌డిఎ పక్షాలు ఆలోచనచేయాలి. ప్రజలపై మోపుతున్నా భారాలను తగ్గించాలి. ధరల పెరుగుదలపై చర్చించాలి. మోడీ ఆర్థిక విధానాలను చర్చించాలి. లేకుంటే ఎన్‌డిఎ పక్షాలు కూడా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. కేవలం కార్పోరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితికి పోతున్నారో గమనించడం లేదు. జిఎస్టీ కారణంగా వస్తువుల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది బిజెపి పాలకులు ఆలోచన చేయాలి. ఎన్‌డిఎ భాసగ్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, ఇతర పార్టీలు కడా దీనిని విశ్లేషించాలి. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ ఉన్నారే తప్ప ఫలితాలను విశ్లేషించుకుని తప్పులను సరిదిద్దుకుందామన్న లక్ష్యాన్ని ప్రకటించడం లేదు. ప్రజల జీవన స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారంటూ, చెప్పు కోవడం ఆత్మవంచన తప్ప మరోటి కాదు. కేవలం కాంగ్రెస్ ను, విపక్షాలను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి. ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహరధాన్యాల ధరలు తగ్గాలి. ఎక్కడ తప్పిదం జరిగిందో పరిశీలన చేయాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీపై ప్రజలకు విశ్వాసం ఉంటే పరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉంటాయి. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే వాత తప్పదని మొన్నటి ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు కొద్దిగా రుచి చూపారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రధాని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టి ప్రచారం చేశారు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేకపోతున్నామని గమనించాలి. సంస్కరణలంటే ప్రజల జీవన ప్రమాణాలు మారాలని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నా, గట్టిగా పోటీ పడలేకపోయినా ప్రజల ఆలోచనలు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేసింది ప్రధాని మోడీ అని గుర్తించాలి. ఇకముందు కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి సవాలు ఎదురవుతుందని భావించాలి. దానికి కాంగ్రెస్ గొప్పతనం కాకుండా మోడీ అనుసరిస్తున్న పిడివాద సంస్కరణల ఫలితమని గుర్తించాలి. హర్యానాలో మళ్లీ అధికారం నిలబెట్టు కోవడం..బిజెపికి ప్రజలు వత్తాసు పలుకుతున్నారని అనుకోరాదు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తుందన డానికి కాశ్మీర్, హర్యానా ఫలితాలే ప్రత్యక్ష నిదర్శనం. తాము ప్రవచిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు ఎందుకు మేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ విపరిణామాలను విశ్లేషించుకోవాలి. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని మిత్రద్వయం గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు. ఇకపోతే అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్య పెట్టిన మోడీ ఆ ఊసే ఎత్తడం లేదు. పదేళ్లు కావస్తోంది. స్వయం ఉపాధి పేరుతో నిరుద్యోగులను మభ్యపెడు తున్నారు. గత పదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కార్మిక వ్యతిరేక విధానాలతో వేలాది పరిశ్రమలు మూతపడడానికి కారణం అయ్యారు.బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు, నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కారణంగా కనీసం 6 కోట్ల మందికి ఉపాధి పోయిందని అంచనా. అన్ని సంస్థలను ప్రైవేటుకు అప్పగించే పనిలో మాత్రం వేగం పెంచారు. రైల్వేరంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు. పండిరచిన పంటకు గిట్టుబాటు ధరలేక, దిగుబడిలేక ఎంతో మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరోనా వైరస్ కష్టకాలంలో ఉపాధి లేక వేలాదిమంది ఆకలితో అలమటించారు. ఆసుపత్రులకు డబ్బులు కట్టలేక ఆస్తులు అమ్ముకున్నారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆనాటి పరిస్థితులను చూసి చలించిన ఎందరో వారిని దగ్గరికి తీసి, వారి ఆకలిని తీర్చి వారిని వారి గమ్యస్థలాలకు చేర్చే ప్రయత్నం చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం వారిని గాలికొదిలేసింది. మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అనుకూల రాజకీయాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్లకు వివిధ రకాల రాయితీలు, కానుకలు సమర్పిస్తూ వారిని మరింత సంపన్నవంతం చేయడం దారుణం. భారత రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం సగటున ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలు సంపన్నులకు రద్దయ్యాయన్నది గుర్తించాలి. కార్పొరేట్లు తీసుకున్న రూ.4.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాల్లో కేవలం రూ. 1.61 లక్షల కోట్లు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వసూలు చేశారు. అంటే బ్యాంకులు రూ.2.85 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇలా బ్యాంకుల సొమ్ము కార్పొరేట్ల పాలు అవుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక పరోక్ష పన్నులను, సెస్సులను పెంచి జనంపై భారాలు పెంచి, ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్లకు వివిధ రూపాల్లో రాయితీలు కల్పిస్తోంది. బడ్జెట్లో దాదాపు 8శాతం కార్పొరేట్ పన్ను రాయితీల ద్వారా వారికి లక్షల కోట్ల రూపాయల లబ్ది చేకూర్చింది. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా సంపన్నులకు ప్రజల సంపదను దోచిపెడుతున్న సర్కారు సామాన్య రైతులు, సాధారణ ప్రజలపట్ల మాత్రం కర్కశంగా వ్యవహరిస్తోంది. కరువు కాటకాల వలన, వరదలు, తుపాను వలన నష్టపోయి లేదా పంటకు న్యాయమైన ధర దక్కక తీవ్రంగా నష్టపోయిన కారణంగా బ్యాంకులో తీసుకున్న రుణం తిరిగి తీర్చలేని రైతుల నుండి మాత్రం ఎటువంటి మినహాయింపు లేకుండా వసూలు చేయాలని బ్యాంకులను సర్కారు ఆదేశిస్తుంది. ఈ పదేళ్లలోనే పది లక్షల కోట్ల రూపాయలకు పైగా కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఆర్థిక క్రమశిక్షణ ఏమయినట్లో మోడీ సర్కారే చెప్పాలి.

## పర్యావరణ హితం
# పట్టని పాలకులు

### పెరుగుతున్న పట్టణీకరణతో కాలుష్యం నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలం

**న్యూఢిల్లీ, నినాదం:**



పర్యావరణ పరిరక్షణ అన్నది కేవలం నినాదంగా మారింది. ఢల్లీ విషయమే తీసుకుంటే వాతావరణ కాలుష్యం అరికట్టే చర్యలు కానరావడం లేదు. కోర్టులు మొత్తుకుంటున్నా పట్టింపు లేదు. కాలుష్యం కారణంగా తాను వాకింగ్‌కు కూడా వెళ్లలేక పోతున్నానని సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ఎంతగాపరిస్థితి దిగజారిందో గుర్తించాలి.ఢల్లీ కాలుష్యపరిస్థితిలో మార్పు కానరావడం లేదు. గాలి నాణ్యత పడిపోతున్నా పట్టించుకోవడం లేదు. పంట వ్యర్థాలను కాల్చకుండా కూడా అరికట్టడం లేదు. మానవాళికి చెట్లు చేసే మేలేమిటో తెలుసుకోవడానికి ఎవరూ గూగుల్‌ను ఆశ్రయించనవసరం లేదు. పర్యావరణవేత్తలు చెబితే తప్ప తెలియని వారెవరూ లేరు. చెట్ల ఉపయోగాల గురించి బడి చదువుల దగ్గరనుంచి గురువులు నూరిపోయడమే ఇందుకు కారణం. దురదృష్టమేమంటే అధికార పీఠాలపై ఉన్న నేతలు, ఉన్నతాధికార వర్గంలో పనిచేస్తున్నవారు ఏ బళ్లో చదువుకుని ఆ స్థాయికి ఎదిగారోగానీ... దేశంలో 'అభివృద్ధి' పేరు చెప్పి వృక్ష సంహారం జరగని రోజంటూ దేశంలో ఉండటం లేదు. చెట్లను కాపాడటానికి పర్యావరణ ఉద్యమకారులు చేయని పోరాటమంటూ లేదు. ప్రాణవాయువును అందిస్తున్న వృక్షజాలాన్ని ధ్వంసం చేయాలా అని ప్రశ్నిస్తున్నారు. విభిన్న జాతుల పక్షుల్ని వీక్షించడానికి, తమ కెమెరాల్లో బంధించడానికి విహంగ ప్రేమికులు నిత్యం ప్రకృతి ఒడిలోకి వస్తారు. ప్రశాంతంగా స్వచ్ఛమైన వాయువు పీల్చి పునీతులు కావడానికి నగర వాసుల్లో అత్యధికులు ఎన్నుకునే పార్కులు, చెట్లు ఉన్నచోటే. ఇది లోపించడం వల్ల ఇటీవల ఢల్లీ కాలుష్యం పీల్చలేనంతగా తయారయ్యింది. చెట్లనుంచి వీచే గాలిని ఆస్వాదిస్తూ వందలమంది సైక్లింగ్, జాగింగ్ చేస్తుంటారు. పాలకుల తీరు కారణంగా, నగాల వ్యాప్తి కారణంగా ముంబైతో సహా మన మహానగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. ఉపాధి దొరుకు తుందని పల్లెలు వీడి వస్తున్న వారితో పట్టణీకరణ పెరుగుతోంది. ప్లాస్టిక్ విపరీతంగగా వాడకం పెరరిగి అనేకం కాలుష్య కారకాలుగా తయారయ్యాయి. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత నగరాలు 20 ఉంటే అందులో 15 మన నగరాలే. తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రపంచంలోని 15 నగరాల్లో మన వాటా 11. ఈ నగరాల వాతావరణంలో, ఇక్కడి తాగు నీటిలో మృత్యువు దాగుందని నిపుణులు చాన్నాళ్లుగా చెబుతున్నారు. నగర పౌరుల ఊపిరితిత్తుల్లోకి కొంచెం కొంచెంగా చొరబడుతున్న కాలుష్యం వారిని రోగగ్రస్తులుగా మారుస్తోంది. కేన్సర్, గుండె జబ్బులు వగైరాలకు కారణమవుతోంది. అనేకుల్లో అకాల వృద్ధాప్యాన్ని కలిగిస్తోంది. వారిని పనిపాటలకు దూరం చేస్తోంది. ఇదంతా మన పాలకులకు ఆందోళన కలిగించాలి. దీన్ని సరిచేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి పురిగొల్పాలి. కాలనీలో చెట్లు పెంచాలి. ఉన్న చెట్లను తొలగించకతప్పదను కుంటే ఆ చెట్లను మరొకచోట పాతడానికి ప్రయత్నించాలి. ప్రపంచ అధ్యయన సంస్థలు చెబుతున్న వాస్తవాలను అమలు చేయాలి. ఇల్లు కట్టుకుందా మనో, ఉన్న ఇంటిని విస్తరించుకుందామనో ఎవరైనా తమ ఆవరణలో చెట్లు కొట్టాలంటే అందుకు అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమకు అలాంటి నిబంధనలు వర్తించవన్నట్టు అధికార యంత్రాంగాలు ప్రవర్తిస్తున్నాయి. పాలకులే ఇలా చట్టాల్ని ధిక్కరించే స్థితికి దిగజారడం కారణంగా దేశంలో పర్యావరణం దెబ్బతింటోంది.

175 నియోజకవర్గాల్లో ఒకేసారి
# టీడీపీ సభ్యత్వాలు

### మంగళగిరిలోని ప్రారంభించిన ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి:



రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒకేసారి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యమ్రాన్ని టీడీపీ అధినేత ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునః ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో భాగంగా పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రూ.100 కట్టి సీఎం చేతుల మీదుగా మ్నెదటి సభ్యత్వాన్ని తీసుకున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలని శుక్రవారం నాడు సీఎం చంద్రబాబు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వందల, వేల మంది కార్యకర్తల కృషి ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టీడీపీ పార్టీ సేవలు అందించగలుగుతుందని అన్నారు. ఆపద సమయంలో వారిని ఏ విధంగా ఆదుకుంటామో చేసి చూపిస్తామని సీఎం చెప్పారు. పార్టీ కోసం అనేక మంది కార్యకర్తలు, నేతలు వివిధ స్థాయిల్లో కష్టపడి పని చేశారని ఆయన చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పోరాడి అనేక కేసులు పెట్టించుకున్నారని, జైలుకు వెళ్లారని, ఆస్తులు పోగొట్టుకున్నారని చంద్రబాబు తెలిపారు. అలాంటి వారికి కచ్చితంగా టీడీపీ పార్టీ అండగా నిలబడుతుందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన పలువురు కార్యకర్తలతో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. గతంలో ఇన్స్యూరెన్స్ రాని 73 మందికి రూ.2లక్షల చొప్పున చంద్రబాబు అందించారు. ఈ మేరకు నేడు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. రూ.100లు కట్టి సభ్యత్వం తీసుకుంచే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ప్రమాద బీమా వర్తిస్తుంది. రూ.లక్ష కడితే పార్టీలో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. ప్రమాదవశాత్తూ చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు తక్షణసాయం అందజేస్తారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం ఆర్థిక సాయం అందిస్తారు. మరోవైపు కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూ.లక్ష కట్టి మంత్రి భరత్ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సభ్యత్వం తీసుకున్న వారికి అనేక ప్రయోజనాలు ఉంటాయని, ఆపద సమయంలో పార్టీ అండగా నిలబడుతుందని ఆయన హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు.

# దండుపాళ్యం బ్యాచ్‌లా బిఆర్‌ఎస్ సోషల్ మీడియా

### కేటీఆర్, హరీష్ రావులకు మతి భ్రమించింది టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్ :**

బిఆర్‌ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం బ్యాచ్‌లా మారిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టనని హెచ్చరించారు. తాను కలెక్టర్‌ను తిట్టినట్టు వీడియో క్రియేట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై ట్రోల్ చేసేవాళ్లు దొరికితే బట్టలూడదీసి కొడతాననని జగ్గారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. బిఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులపై జగ్గారెడ్డి విరుచుకు పడ్డారు. వారిద్దరికీ మతిభ్రమించిందని దుయ్యబట్టారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికారం లేక కెటిఆర్, హరీశ్ రావు ఇష్ట మొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. ఇక, మహిళా కలెక్టర్‌పై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ కలెక్టర్‌కు తాను ఫోన్ చేస్తే ఎత్తలేదని, దీంతో తనకు కోపం వచ్చి తిట్టానంటూ బహిరంగంగానే చెప్పారు. కలెక్టర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీనిపై జగ్గారెడ్డి మరోసారి స్పందించారు. తాను చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత కలెక్టర్‌ను ఉద్దేశించి కాదని.. గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్లపై వ్యాఖ్యలు చేసినట్లు ఆయన వెల్లడిరచారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇద్దరు కలెక్టర్‌లకు పది సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు.. వాళ్ళని తిట్టాను.. తప్పేంటి. నేను తిట్టింది గత ప్రభుత్వంలో... ఇప్పుడు కాదు' అంటూ వివరణ ఇచ్చారు. అలాగే.. బీఆర్‌ఎస్ సోషల్ మీడియాపైనా జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం ముఠాలాగా తయారైందంటూ విరుచుకుపడ్డారు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్, హరీష్ రావుకు పిచ్చిపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా చర్యలతో కేటీఆర్, హరీష్ రావులు తిట్లు తింటున్నారన్నారు.



(ఆధ్యాత్మిక చింతన)

# మన పూజలో ఆరోగ్యసూత్రం

**తిరుమల, నినాదం:**

పూజ అనేది కూడా ఒక యోగ పక్రియ. మనసుతో చేసే వ్యాయామం. పూజ అంటే చాదస్తం కాదు .మన ఆరోగ్యం, మన జ్ఞానానికి సంబంధించిన విషయమని చెప్పాలి. యోగ ద్వారా మన ఆరోగ్యాన్ని మన కంట్రోల్‌లో ఉంచుకోవడం సాధ్యమని తేలింది. దానికి మరో రూపమే పూజా, ధ్యానంగా గర్తించాలి. గుడి అంటే మన స్వచ్ఛతకు చక్కటి ప్రదేశం. ధ్యానం అనేది మన మెదడుని మనమే ట్యూన్ చేసుకునే పక్రియ. దీప ప్రజ్వలనం అనేది..... త్రాటకం అనే యోగ పక్రియ. రోజూ ఓ మూడు నిమిషాలు నూనె దీపాన్ని తదేకంగా చూస్తే.... కంటి జబ్బులను అరికట్టవచ్చు అని పెద్దలు చెప్పిన మాట. ఏదైనా కష్టమైన మంత్రాన్ని ఓ 11 సార్లు జపిస్తే.. నాలిక మొద్దుబారదు. అది నాలికకు ఎక్సర్‌సైజ్. అందువల్ల ఎటువంటి కష్టమైన పదాలనైనా పలకగలిగే శక్తి వస్తుంది ..ధారణ శక్తి పెరుగుతుంది. భాష మీద పట్టు పెరిగితే...స్టేజ్ ఫియర్ కూడా పోతుంది. భూమిలో ఎక్కడయితే తరంగాలు కలుస్తాయో అక్కడ మూల విరాట్ ఉంటుంది. ప్రతిష్ఠించే ముందు రాగి రేకులను కాల్చి ఉంచుతారు. అవి ఈ తరంగాలకు ప్రేణగా పని చేస్తాయి. మనం గుడి చుట్టు ప్రదక్షిణలో తిరిగినపుడు ఆ తరంగాల శక్తి మన దేహానికి వస్తుంది. గుడిలోనే దేవుడు వుంటాడా అనేది ఒక వాదన.. ఎక్కడైన వుంటాడు కాని ఈ దేవాలయ దర్శనం అందుకు పెట్టారు. పుణ్యక్షేత్రాలు ఈ సూత్రంపైనే మీద ఆధారపడి వుంటాయి. ఇవి మన శరీరం లోని షట్ చక్రాలను ప్రభావితం చేస్తాయి. ఆడవారిని మగవారిని నగలు వేసుకుని గుడికి వెళ్ళమనేది మన సంపదను చూపించడానికి కాదు.. బంగారం వంటివి ఈ తరంగాలను బాగా గ్రహిస్తాయని. అదే విధంగా మంత్రోచ్ఛారణలు అక్షర నియమంతో ఒక లయను కల్గి ఉత్తేజపరువస్తాయి. గర్భగుడి ద్వారం ఒక వైపుకు ఉండటం వల్ల ఆ శక్తిని మన శరీరం గ్రహిస్తుంది. అందుకే మరీ ఎదురుగా కాక ఒక వైపుకు ఉండమంటారు. విగ్రహాలు పంచ లోహాలతో ఉంటాయి.. వాటికి పాలు తేనె వంటి వాటితో అభిషేకించినపుడు కింద ఉన్న తరంగాల శక్తితో ఔషధ గుణాన్ని సంతరించుకుంటాయి. హారతి తీసుకునేటపుడు ఆ వెచ్చదనాన్ని మన కంటికి తగిలేలా చేయాలి.. దీనికి ఆయుర్వేద పరిభాషలో స్వేదకర్మ అని పేరు. ఊరికే గాల్లో హారతి తీసుకుంటే చాలదు. తీర్థంలో పచ్చ కర్పూరం.. తులసి.. లవంగాలు ఇలా ఎన్నో.. పంచామృతంతో అభిషేకం చేసినవి తీర్థంగా ఇస్తారు. తడిబట్టలకి ఆక్సిజన్ ని ఎక్కువగా తీసుకునే గుణం ఉంటుంది.. అందుకే మడిని పాటిస్తారు. ఇవన్నీ కూడా మన సైన్సును ఆధారం చేసుకుని ఆచరించేలా చేసినవని గుర్తించాలి. వీటిని ఆచరిస్తే ఆరోగ్యం మనలను వెన్నంటి ఉంటుంది.

## మత్తుతో యువత భవిష్యత్తు నాశనం

**- మాదక ద్రవ్యాల నిషేధ అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన డాక్టర్ మురళీధర్**



**దోర్నకల్ /మరిపెడ అక్టోబర్ 26(నినాదం న్యూస్ )**
మత్తుతో యువత భవిష్యత్తు నాశనం అవుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గుండాల మురళీధర్ అన్నారు. శనివారం నాడు మహబూబాద్ జిల్లా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గుండాల మురళీధర్ మద్యం మాదక ద్రవ్యాల నిషేధ అవగాహన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో గంజాయి భూతం జడలు విప్పుతోందని, విద్యార్థుల జీవితాలను మత్తులో ముంచేస్తోందని, మత్తుకు బానిసగా మారిన యువతను టార్గెట్ చేసుకున్న గంజాయి మాఫియా చివరకు వారినే ఏజెంట్లుగా మార్చి చాప కింద నీరులా తన సామ్రాజ్యాన్ని విస్తరించిందన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ శాతం మంది ఊపిరితిత్తులు,మూత్రపిండాలు, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు.అప్పుడే ఎక్కువ అలవాటవుతూ.. మొదట్లో కొందరు మాత్రమే ఈ మత్తుకు అలవాటుపడి వ్యసనంగా మార్చుకొని అక్కడితో ఆగకుండా పక్కవారిని ఈ మత్తు పదార్థాలు అలవాటు పడేలా చేసి క్రమంగా వారిని బానిసలుగా చేస్తారన్నారు. తల్లిదండ్రులు గమనిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి,ఇంచార్జి డీపీహెచ్ మంగమ్మ,నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి,ఫార్మసిస్ట్ సోములు, అనిత,స్టాఫ్ నర్స్ సుజాత,స్వర్ణ, ఏఎన్ఎం హరిశ ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలి

**- కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు**




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (నినాదం న్యూస్)**
విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.వి.వెంకటేషులు అన్నారు. శనివారం కళాశాల ఆడిటోరియంలో జరిగిన బీకాం ఫ్రెషర్స్ అండ్ ఫేర్వెల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఏ గ్రూపులో చేరిన కష్టపడి చదివితే లక్ష్యాలను సునాయాసంగా చేరుకోవచ్చని సూచించారు. పోటీ ప్రపంచంలో విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించినప్పుడే చదివిన చదువుకు సార్థకత ఏర్పడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్ర మంలో అధ్యాపకులు చక్రవర్తి ,అశోక్ ,జానకి రామ్ రెడ్డి, బుక్క ఉపేందర్, రామారావు, రవి ,తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు



**చింతపల్లి, అక్టోబర్ 26(నినాదం న్యూస్)**
మండలంలోని నెల్వలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల గేటుకు గ్రామస్తులు తాళాలు వేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. తమ పాఠశాలలో 8వ తరగతి వరకు ఉన్నప్పటికిని కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, తమ పాఠశాలకు కేటాయించిన ఉపాధ్యాయులను తమ పాఠశాలలో మాత్రమే ఉంచాలని డిమాండ్ చేస్తూ, గ్రామస్తులు తాళాలు వేశారు. ఇటీవల డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలకు వచ్చినప్పటికీ ఇతర పాఠశాలకు డిప్యూటేషన్ పై పంపించడం జరిగిందని గ్రామస్తులు వాపోయారు. తమ పాఠశాలకు కేటాయించిన ఉపాధ్యాయులను తిరిగి తమ పాఠశాలకు పంపించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలకు తాళాలు వేసి పాఠశాల ముందు ధర్నా నిర్వహించిన వారిలో గజ్జల వెంకట్ రెడ్డి, గొడ్డటి మధు యాదవ్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## తాటిచెట్టుపై నుండి పడి గీతకార్మికుడి మృతి

**చౌటుప్పల్,అక్టోబరు 26(నినాదంన్యూస్):**
మండలంలోని లింగోజిగూడెం గ్రామంలో గీతకార్మికుడు రామనగోని లింగయ్య(59) తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు క్రింద పడి తీవ్ర గాయాలయ్యాయి. రోజువారి మాదిరిగా కల్లుగీయడానికి లింగయ్య శుక్రవారం సాయంత్రం చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు క్రింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. లింగయ్య కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.



## 13వ రోజు అయ్యప్ప స్వాములకు అన్నదానం

**కోదాడ (అనంతగిరి ),అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
తెలంగాణ శబరిమలగా పేరుగాంచిన అనంతగిరి శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సన్నిధానంలో 13 వ రోజు శనివారం సైతం అన్నదానం కొనసాగింది. దాతల సహకారంతో 48 రోజులపాటు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని దాతలు ఎవరైనా ఉంటే సహాయ సహకారాలు అందించేందుకు దేవాలయ కమిటీని సంప్రదించవలసిందిగా దేవాలయ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో పందిరి వీరయ్య,గాదం లింగయ్య,,నల్లచర్ల రామకృష్ణ, గవిని రామకృష్ణ,గాదం శ్రీను, సీ,హెచ్, రామకృష్ణ ఐతనబోయినవెంకటేశ్వర్లు,దండు రమేష్, గరిడేపల్లి ఉపేందర్ తో పాటు అనూహ్యం గా 630 మందికీ పైగా అయ్యప్ప లు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలి




**- సమన్వయంతో పని చేస్తే సక్సెస్ అవుతాం**
**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**
ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జ్ సంపత్ రావు, డిపిఓ దేవ్‌రాజ్‌లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా విధి నిర్వహణలో ఎన్నో మంచి పనులు చేసే అవకాశం ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకొని పనిచేయాలన్నారు. జిల్లాలోని 31 వసతి గృహాల్లో అత్యవసర 3 పనులను తక్షణమే నివేదిక సిద్ధం చేసి సమర్పించాలనీ అధికారులను సూచించారు. 3 రోజులలో పనులకు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణలో భాగంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ఎంతో డబ్బును వెచ్చిస్తుందని అన్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మండల పర్యటనలో తప్పని సరిగా హాస్టల్స్, పాఠశాలలు తనిఖీ చేయాలని, తనిఖీలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. గ్రామాల్లో నీటిని సకాలంలో, సక్రమంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడంపై మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో వాటర్ లికేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛమైన త్రాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అన్నీ కులాల సామజిక వర్గాలకు సంబందించిన ఆర్థిక పరమైన, సామజిక పరమైన రాజకీయ పరమైన సమస్యల గురించి మండల కేంద్రాలలో సమావేశాలు నిర్వహించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిఓ లు, ఆర్ డబ్లుఎస్ డిఈలు, ఏఈలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచనా శక్తిని పెంచేందుకే ట్రైనింగ్ క్లాసులు

**- వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకుంటే అన్ని సాధ్యం**
**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో,(నినాదం):**
ప్రతి విద్యార్థిలో ఆలోచనాశక్తిని పెంచేందుకు ఇలాంటి ట్రైనింగ్ క్లాసులు ఉపయోగపడుతాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ 2024 ఇవ్వ టూరిజం క్లబ్ వాలంటీర్ క్యాంపు 20 24 శనివారంతో విజయవంతంగా ముగిశాయి, ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రిటైర్డ్ సీనియర్ ఐఎఎస్ ఆఫీసర్ బీపీ ఆచార్యతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైనింగ్ అనేది ఒక ఐడియా జనరేట్ కావడానికి మిమ్మల్ని మోటివేట్ చేయడానికి ఉపయోగపడుతుందే కానీ మనిషికి వ్యక్తిత్వం వికాసం డెవలప్ చేసుకోవాలని తద్వారానే ఇలాంటివి భవిష్యత్తులో మోటివేషన్‌గా ఉపయోగపడతాయన్నారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ విజయవంతంగా మూడోసారి వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ ప్రోగ్రాం పూర్తి చేసుకున్నామని ఈసారి తెలంగాణ ప్రభుత్వం పర్యాటక శాఖ ప్రోత్సాహంతో యువ టూరిజం క్లబ్ వాలంటీర్ ప్రోగ్రాం కూడా 40 మంది స్టూడెంట్స్ని వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ 40 మందిని మొత్తం 18 మెంబర్స్ కి ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని సబ్జెక్టులలో వివిధ రకాలైన ప్రొఫెసర్లతో ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ 20 24 కోఆర్డినేటర్ శ్రీధర్ రావు, డిస్టిక్ టూరిజం ఆఫీసర్ ఎం శివాజీ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా కన్జర్వేషన్ అసిస్టెంట్ మాడిపల్లి మల్లేశం, యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ నామినీలుగా కిట్స్ వరంగల్ విద్యార్థులు

**- సాంకేతిక పరిష్కారాలను హైదరాబాదులో అందించిన టి - వర్క్స్ సిఇఓ జోగిందర్ తనికెళ్ల**




**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (నినాదం న్యూస్)**
కిట్స్ వరంగల్ నుండి 12 విద్యార్థులు 3 జట్లు వరుసగా 1. టీమ్ నోహ్: నిఖిల్ మదరవేన, శ్రీకర్ శ్రీరామోజు, లక్ష్మీనిరూప్ పాపాని, గుర్మాన్ సింగ్ బజాజ్, 2. టీమ్ వన్ : హాసిని, హరిచరణ్, ఈషా, యశ్వంత్, 3. టీమ్ స్పేస్ స్పెక్ట్రా: ఓనిసుహాస్, సహస్ర, మౌర్య, ప్రణతి గ్లోబల్ నామినీలుగా స్థానాలను పొందారు. కిట్స్ వరంగల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తమ అద్భుతమైన సాంకేతిక పరిష్కారాలను టి – వర్క్స్ సిఇఓ జోగిందర్ తనికెళ్ల హైదరాబాదులో అందించారు. తెలంగాణకు చెందిన సిఇఓ జోగిందర్ తనికెళ్ల కూడా వ్యక్తిగతంగా పతకాలతో సత్కరించారు. అంతర్జాతీయ అంతరిక్ష ఛాలెంజ్ కోసం అంతరిక్ష సాంకేతికత, పరిశోధనలకు కిట్స్ కళాశాల విద్యార్థుల అసాధారణమైన సాంకేతిక వినూత్న ఆవిష్కరణను ఘనంగా ప్రశంసించారని ఫార్మర్ యంపి అండ్ కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి లక్ష్మీకాంత రావు వెల్లడించారు. పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్ యూనివర్సిటీలో జరిగిన నాసా స్పేస్ యాప్స్ ఛాలెంజ్ నేషనల్స్‌లో ఎంపికైన కిట్స్ వరంగల్ ఇంజనీరింగ్ స్టూడెంట్ టీమ్‌లు, అంతే కాకుండా విద్యార్థులు సెక్యూర్డ్ అంతర్జాతీస్థాయి గ్లోబల్ నామినేషన్‌లకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె అశోక రెడ్డి తెలిపారు. ఇన్దుకు గానూ నాసా స్పేస్‌కు ఎంపికైన విద్యార్థులను ఫార్మర్ రాజ్య సభ ఎంపి, కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి నారాయణరెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే, కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రెటరీ, వి సతీష్ కుమార్, ఇతర మేనేజ్‌మెంట్ సభ్యులు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె అశోక రెడ్డి శుభాకాక్షలతో అభినందించి, ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవిష్కరణ సాంకేతిక పురోగతి యొక్క విశేషమైన ప్రదర్శనలో, కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వరంగల్ (కిట్స్ డబ్ల్యు) నుండి ఆరు బృందాలు ప్రతిష్టాత్మకమైన నాసా స్పేస్ యాప్స్ ఛాలెంజ్‌లో పాల్గొనగా మూడు బృందాలు గ్లోబల్ నామినీలుగా గౌరవనీయమైన స్థానాలను సంపాదించా యన్నారు. రాబోయే ఈ ఛాలెంజ్ లలో విద్యార్థులు తమ సీనియర్లను అనుకరిస్తు నైపుణ్యభివృద్ధి నిరంతర ప్రక్రియ గా చేసుకోవాలని వారు సూచించారు. కిట్స్ వరంగల్ కోశాధికారి పి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థులు స్థిరమైన అభ్యాసం, వారి తాజా సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం మంచి అంతర్జాతీయ అంతరిక్ష ఛాలెంజ్ లను పొందడానికి దారి తీస్తాయి అని సగర్వంగా తెలిపారు. కిట్స్ వరంగల్ సాంకేతిక ప్రాజెక్టలలో ఒకటి జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ (జెడబ్ల్యుఎస్‌టి) నుండి డేటాను ప్రభావితం చేసే ఒక వినూత్న ఏఐ ఆధారిత ప్లాట్‌ఫారమ్. బృందం జెడబ్ల్యుఎస్‌టి శాస్త్రీయ డేటాను ఉపయోగించి వ్యక్తిగతీకరించిన ఎఐ రూపొందించిన వీడియోలను, రూపొందించే ఇంటరాక్టివ్ సిస్టమ్‌ను అభివృద్ధి, వాస్తవ టెలిస్కోప్ చిత్రాలను ఎఐ రూపొందించిన విజువల్స్‌తో కలపడం, స్వీయ అభ్యాసం, స్వీయ ప్రేరణను అధ్యాపకులు విద్యార్థులకు అందించడం వలన ఈ విజయము చేకూరిందని తెలిపారు. వివిధ విభాగాల డీన్స్, విభాగాదిపతులు, అసోసియేట్ ప్రొఫెసర్, పి ఆర్ ఓ డాక్టర్ డి ప్రభాకరా చారి, పలువురు బోధన, బోధనేతర సిబ్బంది ఎంపిక అయిన విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

**- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**మంగపేట, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ములుగు జిల్లా మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి అన్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం గంపోనిగూడెం గ్రామానికి చెందిన కొమరం సౌజన్య ఇటీవల మృతి చెందగా మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మృతురాలి కుటుంబాన్నిపరామర్శించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన మేరకు మృతురాలి దశదిన కర్మ కార్యక్రమాల కోసం మృతురాలి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం , ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యాణయ్య, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మైబూబ్ ఖాన్, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హిదాయతుల్లా, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆది నారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, మండల సీనియర్ నాయకులు గాదె సమ్మయ్య, పూనెం రాములు, పూనెం సూరయ్య, నాగార్జున, పూనెం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చలో మానాయి కుంట సభను విజయవంతం చేయాలి



**తుంగతుర్తి,అక్టోబర్ 26(నినాదం న్యూస్):** మూసీ నది ప్రక్షాళన కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ నిర్వహించే చలో మానాయ్ కుంట బహిరంగ సభను విజయవంతం చేయాలని నాగారం మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యలమకంటి సోమయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని అడ్డగూడూరు మండలం మానాయి కుంట గ్రామంలో నిర్వహించే బహిరంగ రైతుల ఆత్మీయ సమ్మేళన సభకు మూసీ నది పరివాహక ప్రాంత రైతులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. మూసీ నది ప్రక్షాళన చేసి మూసీ నది పరివాహక ప్రాంత రైతాంగాన్ని కాపాడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన అన్నారు.

## యాదవుల సదర్ సమ్మేళనంను విజయవంతం చేయండి



**కోదాడ,అక్టోబర్ 26(నినాదం న్యూస్):**
కోదాడలో నవంబర్ మూడో తారీఖున బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న యాదవుల సదర్ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిన్న శ్రీశైలం యాదవ్ కోరారు. శనివారం స్థానిక డైన్ ఇన్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోదాడ,హుజూర్ నగర్ సదర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నవంబర్ మూడో తారీఖున జరుగుతున్న యాదవుల సదర్ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా,యాదవులలో ఆర్థిక,సామాజిక,రాజకీయ చైతన్యం కొరకు ఈ సదర్ సమ్మేళనం ముఖ్యపాత్ర పోషిస్తూ ఒక వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో కమిటీ చైర్మన్ ఎన్ఎం శ్రీకాంత్ యాదవ్ కమిటీ అధ్యక్షులు, బొల్లం సిద్దు యాదవ్,కోఆర్డినేటర్ బత్తుల కిట్టు యాదవ్,హుజూర్ నగర్ కమిటీ అధ్యక్షులు జక్కుల నరేందర్ యాదవ్,కోఆర్డినేటర్ మారాల వీరబాబు యాదవ్,కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్,వైస్ ప్రెసిడెంట్ బొమ్మ సాయి యాదవ్ తదితర యాదవ మేధావులు పెద్దలు నాయకులు యువత పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ఆస్పత్రులు సీజ్

**జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే వెంకటరమణ**



**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (నినాదం న్యూస్)**
వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటరమణ, తన సిబ్బందితో కలిసి శివనగర్ లోని హెల్త్ లైన్ డయాగ్నొస్టిక్ సెంటర్, ఫోర్ట్ వరంగల్‌లో ఆర్ఎంపి క్లినిక్‌ను తనిఖీ చేసి సీజ్ చేయడం జరిగినది వీరు అర్హత లేకుండా, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నందుకు వీరిపైన చట్టప్రకారం చర్యలు ఉంటామని తెలిపినారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్కులు, పోలీక్లినిక్కులు, నడిపే వారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని కోరారు. జిల్లాలో అన్ని క్లినిక్కులు, పోలీ క్లినిక్‌లు, ల్యాబులు, ఆసుపత్రులు, వెల్నెస్ సెంటర్లు, ఫీజియోథెరఫీ సెంటర్లు, కంటి ధావకానలు, క్లినిక్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి, అలాగే ఆయుర్వేద, యునాని, హెూమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని ధావకానలు క్లినిక్ లు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేనిచో పెనాల్టీ వేసి సీజ్ చేయటము జరుగునని తెలిపినారు.అటువంటి క్లినిక్ లు, ఆసుపత్రలపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడును అని హెచ్చరించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలోని ప్రత్యేక బృందాలు ప్రతి క్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్ ఆసుపత్రులను, ఆయుష్ సెంటర్లను తనికీ చేసి నిబంధనల ప్రకారం లేని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకూడదని వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలనీ ఇంజెక్షన్లు, సెలైన్‌లు పెట్టరాదని, అల్లోపతీ వైద్యం చేయరాదని వారి దగ్గర మందుల నిల్వ ఉంచుకోరాదని ఆయన తెలిపారు. విదేశాలలో వైద్య, విద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా ఎఫ్ఎంజి ఈ టెస్టులో ఉత్తీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని తర్వాతనే ఆసుపత్రిలో వైద్యము చేయాలని తెలిపారు. ప్రతి వైద్యుడు తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ లెజబుల్‌గా మాత్రమే రాయాలని కోరారు. ప్రతి క్లినిక్, పోలీక్లినిక్, నర్సింగ్ హెూమ్ ఆసుపత్రులు, ఆయుష్ క్లినికల్, పోలీ క్లినిక్ ఆసుపత్రుల వారు వారి సెంటర్‌లో వసూలు చేయూ ఫీజుల వివరములు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్ భాషలో రిసెప్షన్ నందు బోర్డులు ఏర్పాటు చేయాలనీ, ఆ ప్రకారమే రోగుల నుండి చార్జీలు వసూలు చేయాలనీ, అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పరిశుభ్రత, సౌకర్యాలు అందించే విషయంలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని వారి, వారి ఇంస్టిట్యూట్లో పని చేసే వైద్యులు వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, వారి వారి విద్యార్హతలు కూడా రిసెప్షన్ వద్ద ప్రదర్శించాలని కోరారు. ప్రతి ఆసుపత్రి , నర్సింగ్ హెూమ్ వారు నిర్ణయించుకున్న రేట్స్ (రాక్ రేట్లను) ప్రతి సంవత్సరం జూన్ నెల మొదటివారంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందచేయాలని లేనిచో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సి-సెక్షన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉంటుందని, అనవసరంగా ఇండికేషన్ లేకుండా సి-సెక్షన్ కాన్పులు చేస్తే అట్టి డాక్టర్లపై చర్యల తో పాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కు రాసి సదరు వైద్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎం టి పి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే నిబందన లకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షలో అబార్షన్ చేయాలనీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు అబార్షన్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చిన జబ్బుల గురుంచి పేషెంట్లకు తప్పనిసరిగా వారికీ అర్థమయ్యే భాషలో వివరించాలని, జబ్బుకు అయ్యే ఖర్చులని కూడా ముందుగానే వివరించాలని, రోగుల హక్కులు, బాధ్యతలు ప్రతి ఆసుపత్రలో తెలిపే విదంగా బోర్డులను ఏర్పాటు చేయాలనీ కోరారు.మలేరియా డెంగ్యూ టీబీ, ఎయిడ్స్ వంటి వ్యాధులు సోకిన వారి వివరములు ప్రతినెలా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు తెలపాలని కోరారు. జిల్లా లో తనికీ బృందాలు నిరంతరం క్లినిక్ లు, ఆస్పత్రులు, తనికీ చేస్తుంటాయని, తనికీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతులకు సంబందించిన సర్టిఫికెట్లు, సిబ్బంది వివరములు ధరల పట్టికలు చూపించవలెనని తెలిపినారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటరమణ ,డిప్యూటీ డెమో అనిల్ కుమార్ ,ఎస్ ఓ విజయలక్ష్మి, ఎల్ డి కంప్యూటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అమెరికాకు చేరుకున్న నారా లోకేశ్



• పెట్టుబడులే లక్ష్యంగా పర్యటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎయిర్ పోర్టులో ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. ఏపీలో ఎన్డీఏ కూటమి “అఖండ” విజయం సాధించిన తర్వాత తొలిసారిగా అమెరికాలో లోకేష్ పర్యటిస్తున్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగనుంది. ఈనెల 29న లాస్ వేగాస్ నగరంలో జరుగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు మంత్రి హాజరుకానున్నారు. 31న అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొనను న్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామిక వేత్తలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వై2కె బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ట్రెండిరగ్‌లో ఉన్న ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను మంత్రి వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయని , పరిపాలనలో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నేతృత్వంలో యువనాయకత్వం చురుగ్గా పనిచేస్తోందన్నారు. మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారని.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు సీఎం సరికొత్త పీ-4 విధానానికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసువస్తామన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యతతో కూడిన మానవ వనరులను అందించడానికి, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో కూడా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. నవీన ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ రీసెర్చి సెంట్రిక్‌గా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా

# వైసీపీ కుట్ర



• టిడిపి పనై పోయిందన్న వారే కనుమరుగు అయ్యారు

• ఎక్కడ ఇసుక దందా జరిగినా తిరుగబాటు చేయండి

• రాజకీయంగానే ముందుకు వెళదాం..కార్యకర్తలకు న్యాయం చేస్తా

• టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

**అమరావతి, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలోకి వైసీపీ నేతలు చొరబడ్డారని విమర్శించారు. ఎక్కడ ఇసుక దందా జరుగుతున్నా తిరుగుబాటు చేయండి, తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. మద్యం ఎమ్మార్పీ ధరపై ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించవద్దని మందుబాబులను కోరారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీపై, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీతో కలిపి రూ.97 లు అయ్యే సినరేజ్ ఛార్జీకి రూ.35లకే టెండర్ వేస్తామంటూ వైసీపీ నేతలు వచ్చారని అన్నారు. ఇసుక కొరత సృష్టించి బ్లాక్‌మార్కెటింగ్ చేసి తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే అతి తక్కువ ధరకు టెండర్లు వేశారని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా, ఉచిత ఇసుక స్ఫూర్తి దెబ్బతినకూడదనే సినరేజ్ ఛార్జీలు, జీఎస్టీ కూడా ఎత్తి వేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.నేను 1995 సీఎంనే.. కానీ 2014 సీఎంను కాదు. ఈసారి ఖచ్చితంగా రాజకీయ పరిపాలనే చేస్తా. విశ్వసనీయతను నిలబెట్టుకుంటూ రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. ముఖ్యమంత్రి అయ్యాక పార్టీ వ్యవహారాలు పట్టించు కోవట్లేదని కేడర్ నుంచి వస్తున్న విమర్శలు అర్థం చేసుకోగలను. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ రూ.10లక్షల కోట్లకు పైగా అప్పు భారం మోస్తున్నామనే విషయం గ్రహించాలి. మనం ఓ విషవలయంలో ఉన్నామని గుర్తించాలి. దీనిని పరిష్కరించేందుకు కొంత సమయం అవసరం. ఇప్పటికే చాలా వ్యవస్థలను గాడిలో పెట్టాం. మొన్నటి ఎన్నికల్లో రాక్షసుడితో యుద్ధం చేశాం. వైసీపీ నేతల వల్ల నష్టపోయిన కార్యకర్తలను ఆదుకుంటూనే, ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చాలి. జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా పెట్టిన తప్పుడు కేసులకు చట్ట పద్ధతిలోనే పరిష్కరిస్తా. ఎవ్వరూ తొందరపడొద్దు. ఎక్కువ అంచనాలు పెట్టేసుకుని ఎవ్వరూ నిరుత్సాహపడొద్దు. రాజకీయాల్లో ఎన్ని మార్పులు, సంస్కరణలు వచ్చినా, మూల సిద్ధాంతం ప్రజాసేవని మరవద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనేక మంది నాయకులను తయారు చేసిన పార్టీ తెదేపా అని ఆ పార్టీ చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళగిరిలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ. నేటి తరం చాలా మంది తెలుగు రాజకీయ నాయకుల మూలాలు తెదేపాలోనే ఉన్నాయి. రాజకీయ కార్యకర్తల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కార్యకర్తలను నాయకులుగా తయారు చేసేందుకు అనునిత్యం పనిచేస్తున్నాం. వారి సంక్షేమం కోసం ముందుకెళ్లాం. రాజకీయ కక్షలకు బల్కైన సంఘటనలు చాలా చూశాం. అనేక కారణాలతో కార్యకర్తలు చనిపోయారు. వారి కుటుంబాలను ఆదుకుంటున్నాం అని అన్నారు. తెదేపా పన్కెపోయిందన్న వాళ్ల పన్కెపోయింది. పార్టీయే శాశ్వతం. తెదేపాకు ముందు.. ఆ తర్వాత అన్నట్లు తెలుగుజాతికి గుర్తింపు వచ్చింది. కార్యకర్తల మనోభావాలు గౌరవించే పార్టీ తెదేపా. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా పెట్టిన పార్టీ ఇది. జాతీయ స్థాయిలో తెదేపా పోషించిన కీలకపాత్రలు మరే పార్టీకి సాధ్యం కాలేదన్నారు. రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. క్యాడర్ నుంచి వస్తున్న విమర్శలను అర్థం చేసుకోగలను. అని చంద్రబాబు అన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాటు చేయాలి

• ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. నవంబర్ 6వ తేదీ లోగా ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..” ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 70 నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించేందుకు కూటమి శ్రేణులు కృషి చేయాలి. ప్రభుత్వం అందించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ నేతలంతా కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి. సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ మనదే విజయం కావాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడినట్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ చెమట చిందించాలి. ఏపీలో ఉచిత ఇసుక సరఫరా చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. పదకొండు బోట్స్‌మెన్ సొసైటీల్లో పూర్తిస్థాయిలో ఇసుక అందుబాటులోకి తీసుకువస్తాం. ఉచిత ఇసుక పంపిణీలో స్థానిక నేతలేవరూ జోక్యం చేసుకోవద్దు. ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడే నేతలపై కఠిన చర్యలు ఉంటాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు కమిషన్ల కోసం కక్కుర్తి పడ్డారు. విద్యుత్‌ను అధిక రేట్లకు కొనుగోలు చేసి ప్రజలపై భారం మెపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు టీడీపీ కార్యకర్తలకు అండగా నిలబడ్డారు. వారి శ్రేయస్సు కోసం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేవలం రూ.100 కడితే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకూ ప్రమాద బీమా అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సైతం విజయవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మందితో సభ్యత్వం చేయించే దిశగా కష్టపడాలి” అని చెప్పారు.

## జగన్ పాలనలో రాష్ట్రం పాతాళంలోకి

- పెట్టుబడులపై దృష్టి పెట్టలేదు

: లంకా దినకర్

**విశాఖపట్నం,అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం అధ:పాతాళంలోకి వెళ్లిపోయిందని, కొత్త పరిశ్రమల స్థాపన, పెట్టుబడులపై దృష్టి పెట్టలేదని 20 పాయింట్స్ చైర్మన్ లంకా దినకర్ విమర్శలు గుప్పించారు. శనివారం వైజాగ్ డెవలప్మెంట్ కౌన్సిల్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఏపీ టూర్ అండ్ ట్రావెలర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో లంకా దినకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిలో అగ్రగామిగా ఏపీని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర.. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యానికి అనుగుణంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ లక్ష్యమని వెల్లడిరచారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంతో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమల పునరుద్ధరణ కోసం త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రీన్ ఎనర్జీకి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వలన రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోందన్నారు. దేశానికి ముంబాయి ఎలాగో.. ఏపీకి ఆర్థిక రాజధాని విశాఖ అని లంకా దినకర్ పేర్కొన్నారు. వైజాగ్ డెవలప్మెంట్ కౌన్సిల్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఏపీ టూర్ అండ్ ట్రావెలర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు విశాఖ ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన పెట్టుబడుల పాలసీలు, అవకాశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ.. ఏపీలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలు వినే ప్రభుత్వం వచ్చిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జీవీఎంసీ వద్ద నిధులు లేవని... నగరంలో సీసీ కెమెరా ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు ఇవ్వడానికి ముందుకు రావాలన్నారు. విశాఖ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీ భరత్ కోరారు. ఈ సదస్సులో ఎమ్ ఎస్ ఎమ్ ఈ చైర్మన్ శివ శంకర్, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆదాయం రూ. 3.78 కోట్లు

**తిరుపతి, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. కలియుగ ప్రత్యక్ష దైవం, ఆపదమొక్కులవాడు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 5 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 56,501 మంది భక్తులు దర్శించుకోగా 21,203 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు వచ్చిందన్నారు.

## బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు

**బాపట్ల, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోద్కెంది. మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై గతేడాది దాడికి సంబంధించి నందిగం సురేశ్‌పై తుళ్లూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బోరుగడ్డ అనిల్ కుమార్ పేరును కూడా ఈ కేసులో చేర్చారు. ఇందులో ఏ1గా నందిగం సురేశ్, ఏ2గా బోరుగడ్డ అనిల్ పేర్లు ఉన్నాయి. గత ఏడాది మార్చి 31న అమరావతి ఉద్యమంలో భాగంగా రాజధాని గ్రామమైన మందడంలో నిర్వహించిన సమావేశానికి సత్యకుమార్ యాదవ్, మరికొందరు నేతలు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో మూడు రాజధానుల శిబిరం వద్ద అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్ అడ్డుకున్నారు. తమ అనుచరులతో కలిసి ఇసుప రాడ్లు, రాళ్లతో దాడి చేశారు. ఈ సమయంలో నందిగం సురేశ్ తన అనుచరులను రెచ్చగొట్టినట్లు బీజేపీ యువజన నాయకుడు సురేశ్ తెలిపారు. అయితే అప్పుడు వైసీపీ ప్రభుత్వం ఉండటంతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నాడు మళ్లీ ఫిర్యాదు చేశామని చెప్పారు.

## తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు

**తిరుపతి, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్ పార్క్, వైస్రాయ్ హోటల్ సహా మరో రెండు ప్రాంతాలకు తాజాగా బాంబు బెదిరింపుల మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ఆయా హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఎక్కడా పేలుడు పదార్థాలు దొరకలేదు. దీంతో వాటిని ఫేక్ మెయిల్స్‌గా పోలీసులు నిర్ధారించారు. అనంతరం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతిలో నాలుగు రోజుల క్రితం కూడా ఈ నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టారు. అప్పుడు కూడా ఫేక్ మెయిల్స్‌గా నిర్ధారించారు. దీనిపై రెండు కేసులు నమోదు చేశారు.

## ధరల నియంత్రణపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

• మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని సర్కార్ ఏర్పాటు

**అమరావతి,అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని సర్కార్ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో మంత్రుల కమిటీ ఏర్పాట్కెంది. కమిటీలో సభ్యులుగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ ఎక్స్‌ఆఫీషియో కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకస్మికంగా ఎందుకు పెరుగుతున్నాయన్న అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నిత్యావసరాలు, కూరగాయల ధరల తగ్గింపునకు చేపట్టాల్సిన చర్యలపైనా సిఫార్సులు చేయాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఉత్పత్తి, సప్లై, డిమాండ్ , ధరలకు సంబంధించిన అంశాలు, పంటల తీరు, ఎగుమతులు, దిగుమతులపై కూడా అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశించింది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో నిత్యావసరాలు, కూరగాయలు లభించేలా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని తెలిపింది. ధరలు నియంత్రణలోకి తెచ్చేందుకు అవసరమైన యంత్రాంగం రూపకల్పనకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ అంశాలపై ఓ డేటా బేస్‌ను ఏర్పాటు చేయాలని ఆర్డర్స్ వేసింది. ధరలు పెరిగినప్పుడు మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను అమలు చేసేలా శాశ్వత ప్రాతిపదికన ధరల నియంత్రణ నిధిని ఏర్పాటు చేసేందుకు సూచనలు ఇవ్వాలని వెల్లడిరచింది. ధరల పెరుగుదల , నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై అధికారుల కమిటీ ఇచ్చిన సిఫార్సులను అధ్యయనం చేయాలని సూచించింది. ఆహార పంటలు, నిత్యావసరాలకు సంబంధించి ఉత్పత్తి, సరఫరా, నిల్వలకు సంబంధించి దీర్ఘ, స్వల్పకాలిక ప్రణాళికల అమలుపైనా ప్రభుత్వం సిఫార్సులు కోరింది. ఉత్పత్తి, నిల్వల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా ఏడాది పొడవునా ధరల్ని నియంత్రణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయదారులు, మిల్లర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ , ఆహారధాన్యాలు, పప్పు దినుసులు, వంటనూనె డీలర్లు, ఎగుమతి, దిగుమతిదార్లతో సమావేశం కావాలని ఆదేశించింది. అధ్యయనం అనంతరం తదుపరి నిర్ణయం కోసం సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రుల కమిటీకి ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి




- మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు

**కోదాడ,అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** గ్రంథాలయాలు సామాజిక చైతన్య వేదికలని వాటిని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు అన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా వంగవీటి రామారావు నియామకమైన సందర్భంగా శనివారం కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య, కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామారావు ఎంతో కాలంగా నిబద్ధతతో పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీ బలోపేతానికి విశిష్ట సేవలందించారని వారి సేవలకు తగిన గుర్తింపుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి రావడం తమకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. అందరి సహకారంతో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి కోదాడ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికితన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రావెళ్ల సీతారామయ్య, వేనెపల్లి శ్రీనివాసరావు,బొల్లు రాంబాబు, రఘువర ప్రసాద్, గద్ద నరసయ్య, విద్యాసాగర్, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

## మంగపేట నూతన తహశీల్దార్‌గా తోట రవీందర్

**మంగపేట, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** ములుగు జిల్లా మంగపేట మండల నూతన తహసీల్దార్‌గా తోట రవీందర్ నియమితుల య్యారు. మంగపేట తహశీల్దార్‌గా ఉన్న బైరి వీరాస్వామి ఆగష్టు 31న రిటైర్మెంట్ అయ్యారు. అప్పటి నుండి మంగపేట డిప్యూటి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేశ్వరరావు మంగపేట ఇంచార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ములుగు జిల్లాలో జరిగిన తహసీల్దార్ల బదిలీలలో భాగంగా ములుగు జిల్లా ఎస్.ఎస్ తాడ్వాయి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న తోట రవీందర్‌ను మంగపేట తహశీల్దార్‌గా బదిలీ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తోట రవీందర్ మంగపేట తహసీల్దార్‌గా భాధ్యతలు స్వీకరిం చనున్నట్లు తెలుస్తుంది.





అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు

## మదర్ థెరిసా సొసైటీ సేవలు ఎంతో గొప్పవి

- చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి




**చౌటుప్పల్,అక్టోబరు 26(నినాదంన్యూస్):** దిక్కు మొక్కు లేని అనాథలకు మదర్ థెరిసా సొసైటీ చేసే సేవ ఎంతో గొప్పదని చౌటుప్పల్ ఏసీపీ పి. మధుసూదన్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లోని అనాథ ఆశ్రమంలోని 600 మంది మానసిక దివ్యాంగులకు హైదరాబాదుకు చెందిన మదర్ థెరిసా సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ. 4లక్షల విలువైన నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు దుప్పట్లు గీజర్లు ఫ్యాన్లు ఆయన చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ సమాజంలో ఆదరణ లేక మానసికంగా అనారోగ్యంతో ఎంతోమంది నిరుపేదలు బాధలు పడుతున్నారని రోడ్ల వెంట చెత్తకుప్పల వెంట తిరుగుతూ ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. అలాంటి వారి ఆకలి బాధ తీర్చేందుకు, వారి జీవితాల్లో సంతోషం నింపేందుకు మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని ఈ సొసైటీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అభినందించారు. పుట్టినప్పుడు ఏమీ తీసుకురామని పోయేటప్పుడు తీసుకు వెళ్ళేది ఏమీ ఉండదని గుర్తించి తమ సంపాదనలు కొంత అనాథల కోసం కేటాయించి వారికి సేవలు అందిస్తున్నందుకు మదర్ తెరిసా సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులను ఆయన ప్రశంసించారు. సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఈ సొసైటీని ఆదర్శంగా తీసుకుని తమ శక్తి మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. తాము సైతం సేవా కార్యక్రమాలు పోలీసు శాఖ ద్వారా నిర్వహిం చనున్నట్టు ప్రకటించారు. అనాథ ఆశ్రమ నిర్వాహకుడు గట్టు శంకర్ మాట్లాడుతూ అనాథల ఆకలి తీర్చేందుకు నిత్యావసర సరుకులు సరఫరా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందించే సహకారాన్ని అనాథల ఆకలి తీర్చేందుకే వినియోగిస్తామని ఈ పుణ్యం దాతలకే దక్కుతుందని అన్నారు.మదర్ థెరీసా సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కిరణ్ ప్రధాన కార్యదర్శి ఎలీషా,సొసైటీ డైరెక్టర్ సుధీర్ లు మాట్లాడుతూ అవసరమైన వారికి సేవ చేస్తే ఆత్మసంతృప్తి లభిస్తుందని దేవుడి ఆశీర్వాదం దొరుకుతుందని అన్నారు. 23 ఏళ్లుగా తమ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడిరచారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు పర్ని శివారెడ్డి, సుక్కా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు గంటల్లోనే హైదరాబాద్ టు విశాఖపట్నం



**విశాఖపట్నం, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ఎంత సమయం పడుతుంది? సాధారణ రైళ్లలో వెళ్తే 12 గంటలు.. అదే వందేభారత్ రైలులో అయితే 8.30 గంటల్లోనే వెళ్లొచ్చు. కానీ అదే నాలుగు గంటల్లోనే హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లగలిగితే ఎలా ఉంటుంది.. అతి త్వరలోనే ఆ కోరిక తీరబోతుంది. హైదరాబాద్ నుంచి వైజాగ్ మధ్య రైలు ప్రయాణ సమయాన్ని తగ్గించే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళిక కీలక దశకు చేరుకుంది. ఈ మేరకు శంషాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు ప్రస్తుతం రెండు మార్గాల్లో రైళ్లు వెళ్తున్నాయి. మొదటిది వరంగల్-ఖమ్మం-విజయవాడ మార్గం. రెండోది నల్గొండ-గుంటూరు-విజయవాడ. ఈ రెండు మార్గాల్లో గంటకు 110 నుంచి 130 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణిస్తున్నాయి. కానీ గంటకు 220కి.మీ. వేగంతో రైల్లు ప్రయాణించేలా ఇప్పుడు కొత్త మార్గాలను రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇందులో ఒకటి హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిని అనుకుని ఉన్నట్లుగానే ఉంటుంది. దీన్ని సూర్యాపేట, విజయవాడ మీదుగా మొదటి మార్గాన్ని ప్రతిపాదించింది. ఇందులో భాగంగా వైజాగ్ నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా కర్నూలుకు మరో కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇది వైజాగ్ నుంచి మొదల్కె సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూలు మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి ప్రిలిమినరీ ఇంజనీరింగ్, ట్రాఫిక్ (పెట్) సర్వే తుది దశకు చేరింది. ఈ సర్వే నివేదికను నవంబరులో రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంలో శంషాబాద్, రాజమండ్రి విమానాశ్రయాలకు అనుసంధానించేలా ఈ ప్రణాళికను రూపొందించడం విశేషం. విమాన ప్రయాణికులు అతి తొందరగా స్వస్థలాలకు వెళ్లేలా ఈ సెమీ హైస్పీడ్ రైళ్ల ప్రణాళికను రూపొందించింది.

# పట్టభద్రుల చూపు నరేంద్రుడి వైపే





- నేను మాటల మనిషిని కాదు చేతల మనిషిని
- ప్రైవేటు టీచర్ల సమస్యలు నాకు తెలుసు
- నన్ను గెలిపించండి మీకు అండగా ఉంటాను
- పట్టభద్రుల సమావేశంలో ఆల్ ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

**జమ్మికుంట, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రచారంలో దూసుకెళు తున్న ఆల్ ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా శనివారం జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం స్కూల్, కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఆయన పట్టభద్రుల ను కలిసి మాట్లాడారు. జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి గాంధీ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన నరేందర్ రెడ్డి. అనంతరం పట్టణంలోని న్యూ మిలీనియం స్కూల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన స్కూల్ కరస్పాండెంట్ మునిపట్ల తిరుపతి రెడ్డి తో కలిసి పట్టభద్రుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా పట్టభద్రుల ను పలు పార్టీలు ఓటు బ్యాంకు గా మాత్రమే గుర్తించారని ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు ఏ ఒక్కరు కూడా తీర్చలేదని ఒక అవకాశం ఇచ్చి నన్ను ఎమ్మెల్సీ గా మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే ప్రైవేట్ ఉపాధ్యాయులకు అండగా ఉంటానని వారి సమస్యలపై ప్రశ్నించే గొంతుక అవుతానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చాలీచాలని జీతాలతో ప్రైవేటు ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారని నేను ఎమ్మెల్సీ గా గెలిస్తే ప్రైవేట్ ఉపాధ్యాయులకు కనీసం 25 వేల రూపాయల వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని ప్రైవేటు విద్యాసంస్థలకు అండగా నిలుస్తా నని ఆయన తెలిపారు. కొంతమంది కావాలని జమ్మికుంట లో ఆల్ ఫోర్స్ విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నానని అందుకు స్థలం కొన్నా నని పుకార్లు చేస్తున్నారని ఇక్కడ ఎలాంటి స్కూలు పెట్టే ఆలోచన నాకు లేదని ఇకపై కొత్తగా ఏర్పాటు చేసే ఆలోచన తనకు లేదని మీ అందరికీ అండగా ఉంటూ మీకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి విషయంలో మీకు అండగా ఉండాలని మీకు ఏ కష్టం వచ్చినా మీకు ముందు నేను నిలబడత నని ఆయన పట్టభద్రుల ను ఉద్దేశించి మాట్లాడారు. న్యూ మిలీనియం స్కూల్ చైర్మన్ మునిపట్ల తిరుపతి రెడ్డి నాకు మంచి సన్నిహితుడు అని తప్పకుండా ఆయన సహకారంతో మీరందరూ నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నేను మాట ఇస్తే తప్పని మాటలా మనిషిని కాదని చేతల మనిషిని సమయం వచ్చినప్పుడు ఏ రకంగా మిమ్మల్ని ఆదుకోవాలని ఆ రకంగా ఆదుకుంటానని ఓటు వేసే ముందు ఒక్క క్షణం ఆలోచించాలి అని తెలిపారు. ఆల్ ఫోర్స్ విద్యాసంస్థలను స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భవిష్యత్తులో కూడా మీ సహకారంతో ఇంకా మీకు సేవ చేసే అదృష్టాన్ని నాకు కల్పించాలని ఆయన కోరారు. మీరు మద్దతు ఇచ్చి నన్ను గెలిపిస్తే భవిష్యత్తులో మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా ఎవరు ఎలాంటి వారో తెలుసుకొని మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించి మీతో పాటు మీ బంధువులను మీ సన్నిహితులకు మొదటి ప్రాధాన్యత ఓటు గురించి వివరించి నాకు వేసేలా ప్రోత్సహించాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూ మిలీనియం స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ రెడ్డి పాఠశాల సిబ్బంది తోపాటు కృష్ణారెడ్డి పంజాల శ్రీనివాస్ శ్రీకాంత్ తో పాటు స్థానిక పట్టబద్రులు తదితరులు నరేందర్ రెడ్డి వెంట ఉన్నారు.

**నరేందర్ రెడ్డి కి ట్రస్మా సహకరించిన?**

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆల్ ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి కి కరీంనగర్ జిల్లా ట్రస్మా నాయకులు సహకరించే నా అనే సందేహాలు వెలు బడుతున్నాయి. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉండగా ఆయనకు కాదని నరేందర్ రెడ్డి కి ట్రస్మా సహకారం అందించడం కష్టమే అని పలువురు పట్టబద్రులు అంటున్నారు. యాదగిరి శేఖర్ రావు నరేందర్ రెడ్డి ఇద్దరు కూడా ప్రచారంలో స్పీడ్ పెంచినప్పటి కీ నరేందర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడం దాదాపుగా ఖరారు అయినట్లే అని పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. ఒకవేళ అదే నిజమైతే నరేందర్ రెడ్డి గెలుపును ఎవరు ఆపలేరని జోరుగా చర్చ జరుగుతుంది. ఒకవైపు విద్యా సంస్థల అధినేతగా ఎంతో మంచి పేరు ఉన్న నరేందర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ టికెట్ లభిస్తే ఆయన గెలుపును ఎవరు ఆపలేరని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి తన విద్యాసంస్థల్లో ఉత్తీర్ణులైన ఎంతోమంది పట్టభద్రులు ఆయనకు సహకరిస్తారని స్థానికంగా చర్చ జరుగుతుంది.

## సేవాభారతి సేవలు అభినందనీయం

### -ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



**జగిత్యాల, అక్టోబర్ 26(నినాదం న్యూస్):** ఆర్ ఎస్ ఎస్ అనుబంధ సంస్థ సేవాభారతి ద్వారా పేద, గ్రామీణ విద్యార్థులకు, మహిళల అభ్యున్నతి కోసం వాల్మీకి ఆవాసం-సేవా భారతి జగిత్యాల శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.వాల్మీకి ఆవాసం-సేవా భారతి ధరూర్ క్యాంప్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో మూడవ బ్యాచ్ కు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం ముగిసిన సందర్భంగా సంబంధిత సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, సేవాభారతి రాష్ట్ర సంఘటనా కార్యదర్శి శ్రీవాసు, ఆవాసం అధ్యక్షుడు జిడిగే పురుషోత్తం, రోటరీ క్లబ్ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ సిరిసిల్ల శ్రీనివాస్, వార్డ్ కౌన్సిలర్ వొద్ది శ్రీలత రామ్మోహనరావు, నిర్వాహక ప్రతినిధులు సందెల్లి మదన్ మోహన్ రావు, అశోక్ రావు, బెజ్జంకి సంపూర్ణ చారి, మహిపాల్ రెడ్డి, స్రవంతి, కోటగిరి సంధ్యారాణి, స్వప్న,అమల, శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు నక్క కవిత, కవోష్ణ , సత్యం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆధునిక పరిస్థితులలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థికంగా, స్వయంశక్తితో ఎదగడానికి ముందుకు రావాలన్నారు. స్వశక్తి సంఘాల ద్వారా మహిళలు తమకు తాము ఎదుగుతూ కుటుంబానికి ఆదర్శంగా నిలవాలన్నారు.ఆర్థికంగా ఎదగడానికి, ఆత్మస్థైర్యం పెంపొందించడానికి మహిళలకు, యువతులకు వివిధరకాల వృత్తి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవాభారతి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సేవాభారతి ప్రాంత సంఘటనా కార్యదర్శి శ్రీవాసు మాట్లాడుతూ సేవాభారతి ద్వారా దేశ వ్యాప్తంగా మహిళలు, యువత, విద్యార్థులకు అండగా ఉంటూ, వారి వారి జీవితాలను సవ్యమైన దిశలో నడిపించుకోవడానికి అనేక రకాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.యూవత పెడదారి పెట్టకుండా చిన్న నాటి నుంచే తల్లితండ్రులు పిల్లలకు సంస్కారం నేర్పినపుడే సమాజం, వారి వారి కుటుంబాలు బాగుంటాయన్నారు. అలాగే, సేవాభారతి ద్వారా నిర్వహించే వృత్తి శిక్షణా కార్యక్రమాలను కేవలం శిక్షణకే పరిమితం చేయకుండా, జీవనోపాధి కోసం ఉపయోగించుకుని, ఆర్థికంగా స్థిరపడాలన్నారు. సేవాభారతి అందించే సంస్కారన్ని అలవార్చుకోవాలని ఈ సందర్భంగా శ్రీవాసు కోరారు. మున్సిపల్ ఛైర్పర్సన్ ఆడువాలా జ్యోతి మాట్లాడుతూ, ప్రభుత్వం ద్వారా తలపెట్టిన మహిళా స్వశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు.

## ప్రయివేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తా

### -ఎన్నికల ప్రచారం నిర్వహించిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్



**కరీంనగర్, అక్టోబర్ 26(నినాదం న్యూస్ ):** ప్రతి పట్టభద్రుడు తమ ఓట్లు నమోదు చేసుకోవాలని పలువురిని కోరిన రవీందర్ సింగ్ ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ ప్రయివేట్ స్కూల్ టీచర్స్ సమస్యలను మండలిలో పరిష్కారం చేస్తానని ప్రయివేట్ టీచర్స్ వారికి ప్రయివేట్ ఉద్యోగులకు వారి అన్ని విధాలుగా అండగా ఉంటానని వారు అన్నారు.అదేవిధంగా పట్టభద్రులు తమ ఓటు నామోదు చేసుకోవాలని మీరు వేసే ఓటు ద్వారానే పట్టభద్రుల జీవితాలలో మార్పు తీసుకురావడం జరుగుతుందని.నవంబర్ అరు 2021 లోపు డిగ్రీ పూర్తి చేసిన వారందరూ తమ ఓట్లు నామోదు చేసుకోవాలని కోరారు. పోయినసారి నామోదు చేసుకొని ఓట్లు వేసినవారు కూడ మళ్ళీ ఈసారి కూడ నామోదు చేసుకోవాలని సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు..నాకు ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రయివేట్ టీచర్స్ సమస్యలను పట్టభద్రుల, నిరుద్యోగుల, సమస్యలను మండలిలో మాట్లాడి వాటి పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తానని అన్నారు.అదేవిధంగా కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రతిఒక్క పట్టభద్రుడికి దేశంలో ఎక్కడ లేనటివిధంగా కేవలం ఒక్క రూపాయకే హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తాను ఎందుకంటే నిరుద్యోగులు మరియు ప్రయివేట్ ఉపాధ్యాయులు, డిగ్రీలు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగులు లేక ఇతర ప్రయివేట్ సంస్థలలో పనిచేసే వారి సమస్యలు నాకు తెలుసు చాలీచాలని జీతాలతో వారు జీవితాన్ని నెట్టుకోస్తున్నారు.ఈ కార్యక్రమంలొ పలు విధ్య సంస్థల ప్రతినిధులు గంజి స్వరాజ్ బాబు, చుక్కరెడ్డి, మల్లికార్జున్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కటకం రమేష్ పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

### -రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ డిమాండ్

**కరీంనగర్, అక్టోబర్ 26(నినాదం న్యూస్ ):** కరీంనగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ లను కట్టించి గత ప్రభుత్వం నిరుపేదలకు ఇవ్వకుండా నిరుపేదలను ఇబ్బందులకు గురి చేసిందని ప్రజా పాలన ప్రజల కోసం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్లను ఇదివరకే కట్టించిన గత ప్రభుత్వంలో ఉన్నవి కాబట్టి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్లను స్వాధీనం పరచుకొని కరీంనగర్ నియోజకవర్గంలో అసలైన నిరుపేదలకు ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గం లో చింతకుంట గ్రామంలో. ఆరెపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్లను కట్టించిన అలాగే వదిలి పెట్టారని అవి కూలడానికి ఉన్నాయని వెంటనే ప్రభుత్వం స్వాధీనం పరచుకొని నిరుపేదలకు ఇచ్చినట్లయితే నిరుపేద కుటుంబ సభ్యులు దాంట్లో ఉంటూ జీవనాన్ని కొనసాగిస్తారని. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని. నిరుపేద కుటుంబ సభ్యులు సంతోష పడతారని వెంటనే ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ లను అసలైన నిరుపేదలను గుర్తించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు వెంటనే ప్రభుత్వం అధికారులతో విచారణ చేయించి అసలైన నిరుపేదలకు నియోజకవర్గంలో ఉన్నటువంటి వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.




## పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలి

- ఎమ్మార్వోకు వినతి పత్రం ఇచ్చిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

**జమ్మికుంట, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం జమ్మికుంట ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఎమ్మార్వో రమేష్ కు వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6500 పైగా పెండింగ్లో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ లు పెండింగ్ లో ఉన్నాయి అని తెలియజేశారు. వాటిపైన ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్చించిన దాఖలాలే లేవని గత కొన్ని రోజుల ముందు డిగ్రీ కళాశాల యజమాన్యాలు కళాశాలలకు బంద్ చేసి ధర్నా నిర్వహిస్తే కొంత విడుదల చేస్తానని హామీ ఇచ్చిన పరిస్థితి ఉంది కానీ ఇంతవరకు దానిని అమలు చేయకపోగా కనీసం ఆ అంశంపై చర్చ కూడా పెట్టలేని పరిస్థితి ఉందని వారు అన్నారు. విద్యార్థులు కళాశాల యజమాన్యాలు అనేక



ఇబ్బందులు పడుతున్న కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నేరెక్కినట్టుగా వ్యవహరిస్తున్నారు కావున తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రిబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. లేనియెడల రానున్న రోజుల్లో మంత్రుల ఎమ్మెల్యేల కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కలకోట అఖిల్ సందేశ్ సిద్దిక్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం

**జమ్మికుంట, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత జమ్మికుంటకు తొలిసారి ఓ ప్రైవేటు ఫంక్షన్ కు హాజరు కాగా మున్నూరు కాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కార్యదర్శి పొన్నగంటి మల్లయ్య ఆధ్వర్యంలో శనివారం జమ్మికుంట మండల కేంద్రంలో శాలువా తో ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘం వర్ధిల్లాలని, ఆది శ్రీనివాస్ నాయకత్వం వర్ధిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, కౌన్సిలర్లు పొన్నగంటి రామ్మూర్తి, మేడిపల్లి రవీందర్, పొన్నగంటి సారంగం, ధర్మారం సింగిల్ విండో వైస్ చైర్మన్ మేడిపల్లి మొగిలి, నాయకులు ఆకుల నారాయణ ,కామిశెట్టి మల్లయ్య, పొనగంటి రవీందర్, పొన్నగంటి విష్ణు, మధు, రమేష్ ,తిరుపతి, ఉపేందర్ ,సతీష్, సురేష్, కుమార్, ఏ బూసి



సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితులకు శిక్ష పడేలా కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ కృషి చేయాలి

**జగిత్యాల, అక్టోబర్ 26(నినాదం న్యూస్):** నేరం చేసిన వారికి శిక్ష తప్పదనే భయం కలిగిస్తే సమాజంలో చాలా వరకు నేరాలు కంట్రోల్ లో ఉంటాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని అన్నారు. కేసుల్లో శిక్షల అమలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులు, కోర్టులో పెండింగ్ కేసులపై, వారెంట్స్, సమన్లు తదితర అంశాలను సమీక్షించారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపిం చేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారుల పనితీరులో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. కేసుల్లో నిందితులను దోషులుగా నిరూపించి శిక్షలు పడేలా పని చేయాలని, కోర్టు అధికారుల తో సమన్వయంతో పని చేయడం ద్వారా సాక్షులను, నింధితులను, బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా



చూసుకోవాలని చెప్పారు. బాధితులకు, సాక్షులకు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలని తెలిపారు. కోర్టు కేసుల్లో నిందుతులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఇందుకు అనుగుణంగా కేసులు పెండింగులో లేకుండా చూసుకోవాలని అన్నారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయములో పిపి ల సలహాలు సూచనలు స్వీకరించాలని సూచించారు.ఈ సమావేశం లో డిఎస్పీ రవీంద్ర కుమార్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ రాజు నాయక్, లు కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలపై మేయర్ నిజాయితీ నిరూపించుకో

### -44డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్ర శేఖర్



**కరీంనగర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):** రేకుర్తిలోని సర్వే నెం. 55లో గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడిన కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు తప్పుడు ప్రకటనలు మానుకొని దమ్ముంటే నిజాయితీ నిరూపించుకో వాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్ సవాలు విసిరారు. బాధ్యతా యుత పదవిలో ఉన్న మేయర్ సునీల్ రావు సర్వే నెం. 65లో ఎలాంటి అనుమతి లేని అక్రమ లేఅవుట్ను ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. మేయర్ అక్రమ లేఅవుట్లు జరగకుండా చూడాల్సింది పోయి. ఆ ప్లాట్లు సక్రమమే అని చెబుతూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా సర్వే నెం. 65కు ఆనుకొని ఉన్న చెరువు పక్కన గల దళితుల స్మశాన వాటికకు సంబంధించి గతంలో రూ. 20 లక్షల నిధులతో దింపుడు కల్లం గద్దె, బోరు బావి, స్నానాల గదులను నిర్మించి అప్పటి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేతుల మీదుగా 2017 జనవరి 13న ప్రారంభించారని గుర్తుచేశారు. మేయర్ కొనుగోలు చేసిన 9 ప్లాట్లను ఆనుకొని ఉన్న స్మశాన వాటికలోని దింపుడు కల్లం గద్దె, బోరు బావి, స్నానాల గదులను నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ ఉ ద్యోగుల సహకారంతో ఉద్దేశ్యపూర్వకంగా కూల్చివేసి ఆక్రమణ చేశారని తెలిపారు. నిర్మాణాలు కూల్చివేసిన స్థలంలో రోడ్డు నిర్మాణం చేపట్టి ఎస్సీలకు అన్యాయం చేసేవిధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు. మేయర్ కొనుగోలు చేసిన ప్లాట్లకు సర్వే నెం. 55లోని ప్రభుత్వ భూమిని కలుపుకొని మున్సిపల్ అనుమతి లేకుండా ప్రహరీగోడ నిర్మాణాన్ని పూర్తిచేశారని వెల్లడించారు. సర్వే నెం. 55లో ఉన్న కొంత ప్రభుత్వ భూమిని కూడా మేయర్ ఆక్రమణ చేపట్టిన విషయం నిజం కాకపోతే వెంటనే సర్వే చేసి మేయర్ నిజాయితీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల స్మశాన వాటికలో అధికార దుర్వినియోగంతో దింపుడు కల్లం గద్దె, బోరు బావి, స్నానాల గదులైన ప్రభుత్వ ఆస్తులను మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ధ్వంసం చేసిన సునీల్ రావు మున్సిపల్ ఆక్ట్ 2019 సెక్షన్ 66(2) ప్రకారం మేయర్ పదవికి అనర్హుడని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పురమళ్ళ శ్రీనివాస్

**కరీంనగర్, అక్టోబర్ 26(నినాదం న్యూస్ ):** కరీంనగర్ రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్ ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు ధాన్యం ప్రతి గింజ ప్రభుత్వంమే కొంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షులు కాం రెడ్డి రాం రెడ్డి , ఆయా గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

- సీఎం,మంత్రులపై కౌశిక్ వ్యాఖ్యలు అర్థరహితం
- ఆరోపణలు తప్ప అభివృద్ధి పై ద్యాస లేదు
- దళితులకు అన్యాయం చేసింది నీవు కాదా?
- నిరుద్యోగుల ఉసురు పోసుకొన్నది బీఆర్ఎస్
- మొగోడివైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్ళీ గెలువు
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై నిప్పులు జరిగిన ప్రణవ్



**జమ్మికుంట, ఆగస్టు 26 (నినాదం న్యూస్):** హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహారతీరుపై హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ తీవ్ర ఆగ్రహన్ని వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి,మంత్రుల మీద అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని,పార్టీ మారిన ఎమ్మెల్యేల పట్ల మాట్లాడే కౌశిక్ రెడ్డి నిజంగా మొగుడివి అయితే హుజురాబాద్ నియోజకవర్గంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలిపి చూపించాలని అన్నారు.గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక స్కాంలు చేస్తే,10 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక స్కీములు ప్రవేశపెట్టమని అన్నారు. పదేపదే ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ నాయకులపై మాట్లాడితే పెద్ద లీడర్ అవుతానని అనుకోవడం కౌశిక్ రెడ్డి భ్రమ అని ఆయన అన్నారు. కెసిఆర్,కేటీఆర్ మెప్పు పొందడానికి ఇలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు.గతంలో తాను చెప్పినట్టుగా కౌశిక్ రెడ్డి ఒక బ్లాక్మెయిల్ స్టార్ అని ఎన్నికల్లో గెలిపించకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని నియోజకవర్గ ప్రజలను నమ్మించి హుజురాబాద్ లో గెలిచాడని అన్నారు.హుజురాబాద్ మార్కెట్ విషయంలో ఇక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయాన్ని చేశాడని,దళితుల పట్ల వివక్ష చూపెట్టాడని కేవలం ఓట్ల కోసం మాత్రమే వారిని వాడుకున్నాడని,ఎమ్మెల్సీ గా ఉన్న సమయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేయకుండా,పూర్తి స్థాయిలో దళిత బంధు ఇవ్వకుండా అన్యాయం చేశాడని అన్నాడు.ఎమ్మెల్సీగా,ప్రభుత్వ విప్ గా రెండు సంవత్సరాలు ఉండి ఇక్కడ ప్రజలకు అభివృద్ధి కూడా చేయలేదని ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో తాను హుజురాబాద్ ప్రజలకు ఏం చేశాడో చెప్పాలని అన్నాడు.అధికారంలోకి వచ్చిన పది నెలలలోపే తాము 10 కోట్ల నిధులను అభివృద్ధి చేసి చూపెట్టమని హుజురాబాద్,జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులకు 30 లక్షలు కేటాయించామని అలాగే ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నటువంటి హుజురా బాద్ గ్రౌండ్ ట్రాకర్, ధమ్మక్కపేట గ్రామస్తుల నీటి సమస్యను పరిష్కారం చేస్తున్నా మని త్వరలోనే వాటన్నిటికీ సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇస్తామని అన్నారు. నిరుద్యో గులకు ఉద్యోగాలు ఇవ్వకుం డా అడ్డుకొని వారి ఉసురుపో సుకున్న పార్టీ బిఆర్ఎస్ అని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు.ప్రభుత్వానికి,ప్రజలకు తాను వారధిగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఆరు గారెంటీలు అమలు చేశామని,పదేళ్లు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లోనే రుణమాఫీ చేసిందని సాంకేతిక కారణాల వలన ఆగిన వారికి త్వరలోనే చేస్తామని అన్నారు. మీ ప్రభుత్వ హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయలేదని ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వానిది అని ఆయన అన్నారు. ఒక ఎమ్మెల్యే స్థాయిలో ఉండి అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సహకరించాలి కానీ ఎంతసేపు అనవసరమైన విషయాలతో ప్రజలను గందరగోళ పరుస్తూ తరచూ మీడియాలో కనబడాలని ఒక సంకల్పంతో కౌశిక్ రెడ్డి ముందుకు కొనసాగుతున్నాడని ఆయన అన్నారు. ఇప్పటికే హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేస్తున్న చేష్టలను చూసి తలలు పట్టుకుంటున్నారని ఇలాంటి ఎమ్మెల్యే నా మేము గెలిపించింది అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని ఆయన సూచించారు.

## ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా యూజీటీ పనులు చేపట్టండి

• ఎమ్మెల్యేకు విన్నవించిన సంక్షేమ సంఘం సభ్యులు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా కాలనీ లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ సంఘం సభ్యులు కౌన్సిలర్ భరత్ తో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. పేట బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి తమ కాలనీలో మంచినీటి సరఫరా పైపు లైను పనులు పూర్తి చేయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. యుజిడి – భూగర్భ మురికినీటి పైపు లైను పనులు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్ రెడ్డి, సభ్యులు బండి శ్రీను, కార్తీక్, రమేష్ రెడ్డి, శివ కుమార్ రెడ్డి, సుకన్య తదితరులు పాల్గొన్నారు..

# కార్యకర్త కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి పరమార్శ

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, (నినాదం న్యూస్) : అక్టోబర్ 27:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ సతీష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సతీష్ తల్లిదండ్రులు, భార్యా పిల్లలతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా మద్దూర్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సతీష్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా మద్దూరుకు చేరుకొని సతీష్ స్వగృహంలో నిర్వహించిన దశ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సతీష్ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ భార్య సంగీత తన ఇద్దరు కుమారులు వీరేష్, ఆదిత్య ల ఉన్నత చదువులకు సాయం చేయాలని సీఎం ను కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. జాతీయస్థాయిలో వాలీబాల్ పోటీలలో ప్రతిభ చాటిన సతీష్ తమ్ముడు మణికంఠకు తనకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశం ఇప్పించాలని రెజూమ్ ను సీఎం





రేవంత్ రెడ్డికి అందజేయగా పరిశీలించాలని కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ని సీఎం ఆదేశించారు. అలాగే సతీష్ సోదరి వీరమణి బిడిఎస్ పూర్తి చేసిన తన కొడుకుకు ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఎం కు విన్నవించారు. సతీష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ గరిమానరుల, జోగులాంబ గద్వాల జోన్ -7 డి ఐ జి ఎల్.ఎస్. చౌహాన్ , జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయకుమార్, మద్దూరు జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా యూజీటీ పనులు నిర్వహించాలి : సొంటి రెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** గాజులరామారం డివిజన్ రామ్ కి నుండి జయశంకర్ నగర్ వరకు వర్షపు నీరు, అండర్ డ్రైనేజి ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తున్న పనులతో స్థానిక ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి గుత్తేదారుకు సూచించారు. శనివారం స్థానిక ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన స్థానికులు పార్టీ ముఖ్య నేతలతో కలిసి పరిశీలించారు. 125 డివిజన్ గాజులరామారంలో డ్రైనేజ్ పనులు జరుగుతున్న సందర్భంలో డ్రైనేజ్ పైప్ లైన్లు, మంజీరా పైప్ లైన్ల పగిలిపోవడంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా సత్వరమే స్పందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# మాలలకు వీసీ పదవులు ఇవ్వాలి

• మాల ప్రజా సంఘాల డిమాండ్



**ఖైరతాబాద్, అక్టోబర్26 (నినాదం న్యూస్) :** ఓట్లేసి గెలిపించిన మాలలకు రేవంత్ రెడ్డి సర్కార్ అన్యాయం చేస్తుందని మాల ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వీసీల నియామకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్టీయులకు వీసీలుగా మాలల్నే నియమించాలని డిమాండు చేస్తూ శనివారం హైదరాబా దులో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మంచాల లింగస్వామి ఆధ్వర్యంలో జరిగిన మాల ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు, తాళ్ళపల్లి రవి, మాల,మాల ఉపకులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రాంచందర్, మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్, మాల జన సభ రాష్ట్ర అధ్యక్షుడు గద్ద శ్రీను, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మేక వెంకన్న, మంత్రి నరసింహయ్యలు పాల్గొని ప్రసంగించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ “గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో యావత్తు మాల జాతి మొత్తం కాంగ్రెసు పార్టీకి ఓట్లేసి రేవంత్ రెడ్డికి పట్టం కట్టింది. అధికారంలోకి వచ్చాక కాంగ్రెసు పార్టీ మాలలను పూర్తిగా విస్మరించింది. ప్రత్యేకించి యూనివర్సిటీ వీసీల నియా మకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం చేసింది. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను ప్రకటిస్తే అందులో ఒక్క మాల ప్రొఫెసర్ కూడా లేకపోవడం శోచనీయం. వీసీలు ప్రకటించని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్టీయులకు మాల ప్రొఫెసర్లనే వీసీలుగా నియమించా లి. ఈ రెండు యూనివర్సిటీల్లో అర్హత కలిగిన ఒక మాల మహిళా ప్రొఫెసరుకి కూడా అవకా శమివ్వాలి. రెండు యూనివర్సిటీలకు వీసీలుగా మాలలను నియమించకపోతే కాంగ్రెసు పార్టీని మాల ద్రోహిగా ప్రకటించి రాబోయే పంచాయతీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు.

## ప్రజల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డితోనే సాధ్యం



**మహేశ్వరం, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** అన్ని వర్గాల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని, అవినీతికి తావు లేకుండా ప్రజా పాలన అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్ పేట్ 12వ డివిజన్ మహమ్మద్ మసీదు సమీపంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ తో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ సూచించారు. అవినీతికి తావులేకుండా పాలన అందించడమే లక్ష్యం : మేయర్ సూచించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్ సుక్క శివ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రెరీ భవనస్థలం పరిశీలించిన గ్రంథాలయ చైర్మన్

• చేవెళ్లలో నూతన గ్రంథాలయ భవన స్థలం పరిశీలించిన రాష్ట్రగ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



**చేవెళ్ళ అక్టోబర్ 26( నినాదం న్యూస్) :** రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి శనివారం చేవెళ్ల నియోజకవర్గం కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనస్థల పరిశీలిన చేశారు. చేవెళ్ల గ్రామంలో నిర్మించిన పురాతన భవనం శిథిలావస్థ స్థితికి చేరడంతో ఈ నూతన భవన నిర్మాణానికి వారు స్థల పరిశీలన చేశారు. స్థల పరిశీలన కార్యక్రమంలో స్థానిక నేతలు టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపువసంతం చేవెళ్ల పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి ఏఎంసీ చైర్మన్ పెంటయ్య గౌడ్ వైస్ చైర్మన్ బేగరి రాములు చేవెళ్ళ మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్ చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి డిసిసి ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్ధన్ సోషల్ మీడియా ఇన్చార్జ్ మాణిక్యం పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది

• ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద 125 గాజులరామారం డివిజన్ కైలాష్ హిల్స్ కాలని రోడ్డు నెం.2 లోని ఆర్ జె వి హరివిల్లు అపార్ట్మెంట్ వాసులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ను మర్యాద పూర్వకంగా కలిశారు.తమ కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు, దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ సంభందిత అధికారులకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాలని, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ అధ్యక్షుడు మాధవ రావు, సురేష్, హరికృష్ణ, నాగరాజు, భాస్కర్ రెడ్డి, నితిన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు..

## జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పూర్తి సహకారం

• పీఏసీ చైర్మన్ గాంధీ హామీ



**శేరిలింగంపల్లి అక్టోబర్ 26 (నినాదం) :** ప్రతినిధి శేరిలింగంపల్లి తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని శనివారం శేరిలింగంపల్లి మండల జర్నలిస్టులు కలిశారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టు నాయకులతో కలిసి ఎమ్మెల్యేను కలిసిన జర్నలిస్టులు తమ ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే గాంధీ సహకారంతో గతంలో చందానగర్ లోని సర్వే నెంబర్ 174లో కేటాయించిన 1 ఎకరం స్థలంలో జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సహకరించాలని, ఈ స్థలం పక్కనే ఉన్న సర్వే నెంబర్ 152లో మరో 1ఎకరా స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం మంజూరీ చేసే విధంగా ఎమ్మెల్యే గాంధీ చొరవ తీసుకోవాలని కోరారు. టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఫైళ్ల విట్ఠల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్ ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో సమావేశమై ఇళ్ల నిర్మాణంపై చర్చించారు.

**సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులు..**

జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా శేరిలింగంపల్లిలో జర్నలిస్టులుగా పనిచేస్తూ సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టుల కోసం ఎమ్మెల్యే గాంధీ సహకారంతో చందానగర్ లోని సర్వే నెంబర్ 174లో 1 ఎకరం భూమిని ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. జర్నలిస్టులకు కేటాయించిన భూమిలో ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా గతంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. జర్నలిస్టుల ఇళ్ల కోసం కేటాయించిన భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సహకరించాలని, భూమి కేటాయింపులో ముందుండి మంజూరు చేయించిన ఎమ్మెల్యే గాంధీ ఇళ్ల నిర్మాణంలో సైతం సహకరించాలని కోరారు. శేరిలింగంపల్లిలో జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా పక్కనే ఉన్న సర్వే నెంబర్ 152లో ఉన్న మరో 1 ఎకరా స్థలాన్ని మంజూరు చేయించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు చందానగర్ లో కేటాయించిన భూమిలో ఇళ్ల నిర్మాణం కోసం తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని తెలిపారు. చందానగర్ సర్వే నెంబర్ 152లో 1 ఎకరా స్థలం మంజూరు కోసం తాను గతంలో హామీ ఇచ్చానని, సదరు స్థలం జర్నలిస్టుల హౌసింగ్ కోసం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. శేరిలింగంపల్లి మండల జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు తాను జర్నలిస్టులకు అండగా ఉంటానని, సమిష్టి కృషితో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుందామని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జర్నలిస్టు నాయకులు జగన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, అశోక్, వినయ్ కుమార్, బేగ్, కిషోర్ లతో పాటు శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, శ్యామ్, కృష్ణమాచారి, శ్రీనివాస్ మండల పరిధిలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

## భూ రిజిస్ట్రేషన్ సమస్యలకు పరిష్కారం చూపండి

• మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సమావేశమైన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భూ రిజిస్ట్రేషన్ సమస్యలకు పరిష్కారం చేయాలని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సమావేశం అయ్యారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో కొన్ని కాలనీల్లో వక్ఫ్ బోర్డ్ స్థలాల నెపం చూపిస్తూ, సర్వేనెంబర్ 58 నుండి 226 వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకుండా సబ్ రిజిస్ట్రార్ నిలిపివేయడంతో, దానిని పునరుద్దరించాలని కోరుతూ శనివారం మినిస్టర్ క్వార్టర్స్ లో రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూన శ్రీశైలం గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అనుమతులతో పాటు సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నా, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం పట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. ఈ సమస్యపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ కు ఆదేశాలు జారీ చేశారు. యథాతతంగా రిజిస్ట్రేషన్లు అయ్యేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు శ్రీశైలం గౌడ్ ప్రకటన ద్వారా తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో దుర్గారావు,అప్పారావు,వెంకట రమణయ్య,ఓబుల్ రెడ్డి,సత్యం,హర్షారెడ్డి, రాజేష్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ది గోల్డెన్ బారెల్‌ను.. ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో గోపి చౌదరి, రాజేష్ ముదిరాజ్, కిరణ్ రెడ్డి లు నూతనంగా ఏర్పాటు చేసుకున్న “ది గోల్డెన్ బారెల్ బార్ పబ్” ప్రారంభోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పద్మ రావు, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బేకు శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజున వృద్ధాశ్రమంలో అన్నదానం



**చేవెళ్ల, అక్టోబర్ 26(నినాదం న్యూస్) :** చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బేగరి వినోద్ కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. శనివారం వికారాబాద్ జిల్లా కొత్తగడి సమీపంలోని మహిమ మినిస్టీస్ వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్‌చేసిన అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు ఆర్ఎంపీ వైద్యుడు వినోద్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఆమోస్, హనోక్, గాయిని పూజిత, మల్లేష్, పెంటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు


## అభివృద్ధికి మంజూరైన నిధులను విడుదల చేయాలి



**మహేశ్వరం, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి గతంలో విడుదలైన నిధులను వెంటనే మంజూరు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని రావిరాల పెద్ద చెరువు వద్ద జరుగుతున్న సుందరీ కరణ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చైర్ పర్సన్ భారీగల హేమలత రాజు గౌడ్ తో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి విడుదలైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆమె అన్నారు. గ్రామాలలో నిధులు లేక పెండింగ్ లో ఉన్న పనులన్నీ వెలవెల పోతున్నాయని ఆమె తెలిపారు. గతంలో విడుదలైన నిధులను నియోజకవర్గం అభివృద్ధికి వెంటనే విడుదల చేయాలని ఆమె అన్నారు. ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన ప్రజల కోసం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. గత ఎన్నికలలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె సూచించారు. కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఒక తులం బంగారం చొప్పున ఇవ్వాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన 100 రోజులలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పి నేటికీ ఏ ఒక్క హామీలు కూడా అమలు చేయడం లేదని ఆమె ధ్వజమెత్తారు. ఈ ప్రాంతానికి ఫ్యాక్స్ కాన్ లాంటి పెద్ద కంపెనీలను తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కిందని ఆమె అన్నారు. ఈ కంపెనీలలో చాలామందికి మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆమె చెప్పారు. ఈ ప్రాంతం త్వరలోనే మరో హైటెక్ సిటీ గా మారనుందని గతంలోనే చెప్పామని ఆమె తెలిపారు. రావిరాల పెద్ద చెరువు ను 6.50 కోట్లతో చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భవాని వెంకట్ రెడ్డి, మాజీ చైర్మన్ మధుమోహన్, ఫ్లోర్ లీడర్ శివకుమార్, కౌన్సిలర్లు బోధ యాదగిరిరెడ్డి, రాజమౌని రాజు, జాపాల భావన సుధాకర్, బాకీ విలాస్, సప్పిడి లావణ్య రాజు ముదిరాజ్, రెడ్డి గళ్ళసుమన్, బాధావత్ రవి నాయక్, బూడిద తేజస్విని శ్రీకాంత్ గౌడ్, కమిషనర్ వెంకట్రావు, మేనేజర్ పర్వతాలు,టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య, యూత్ అధ్యక్షుడు సామేల్ రాజు, పెంట మల్ల సురేష్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీకి రాజీనామా.. బీఆర్ఎస్‌లో చేరిక

- గతంలో ఆర్ఎస్పీ ఆధ్వర్యంలో బీఎస్పీలో
- నేడు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక
- పట్నం నరేందర్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ల అండదండలతో బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేస్తాను
- గులాబీ కండువా కప్పుకున్న నర్మద కిష్టప్ప



**కొడంగల్ నినాదం :** బిఎస్పి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నర్మదా కిష్టప్ప ఆపార్టీ కి రాజీనామా చేశారు. అదేసమయంలో హైదరాబాద్ వెళ్లి బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేత బిఆర్ ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు.గతంలో టీజేఏసీ, జనసమితి,బిఎస్పి,పార్టీ లలో నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఊరూరా రాత్రింబవళ్లు తిరుగుతూ గ్రామ కమిటీ లు, మండల కమిటీ లు ఏర్పాటు చేస్తూ,నియోజకవర్గ ప్రజలకు దగ్గరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి బిఎస్పి రాష్ట్ర నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అండదండలతో బిఫారం పొంది ఆపార్టీ తరఫున ఎమ్మెల్యే గా కూడా పోటీ చేసి తన వాణి వినిపించారు.అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ ఎస్ పార్టీలో చేరగా తాను మాత్రం అలాగే ఉండిపోయారు. తాజాగా రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ సమీకరణాలు, తన భవిష్యత్ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, బిఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ లతో చర్చించిన అనంతరం తాను బిఎస్పి పార్టీకీ రాజీనామా చేసి, బిఆర్ ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొన్నాల లక్ష్మయ్య,వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు మెతుకు ఆనంద్, నియోజకవర్గ నాయకులు సలీం, కోట్ల మైపాల్,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిశుపాల్



**చేవెళ్ల అక్టోబర్ 26( నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శిశు పాల్ నగరంలోని కోకాపేటలోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ పటిష్టతకు కృషి చేసూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు దిశానిర్దేశం చేసినట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శిశుపాల్ తెలిపారు.

# కొత్త జయపాల్ రెడ్డిపై ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు దళిత నేతల ఫిర్యాదు

- ఎమ్మెల్యే కవ్వంపల్లిపై మైత్రీ చానెల్ లోనూ తప్పుడు కథనాలు



**కరీంనగర్, అక్టోబర్ 26(నినాదం న్యూస్ ):**
మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు ఆరోపణలు చేస్తున్న కొత్త జయపాల్ రెడ్డితోపాటు అవాస్తవ కథనాలను ప్రసారం చేస్తున్న మైత్రీ ఛానెల్ పైన కఠిన చర్యలు తీసుకోవాలని మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన దళిత సంఘాల నాయకులు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ ను కోరారు. ఈ మేరకు శనివారం దళిత నాయకులు అలువాల కోటి, సముద్రాల లక్ష్మణ్, రెడ్డిగాని రాజు, కనుకం అశోక్, మచ్చ రాజేశం, చెలిగంటి సంపత్, జేరిపోతుల రాజు, జేడి శ్యామ్, పొన్నాల చిరంజీవి తదితరులు హైదరాబాద్ లో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి ఫిర్యాదు చేశారు ఇటీవల కొంతకాలంగా మానకొండూర్ (ఎస్సీ) నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై పథకం ప్రకారం కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి మైత్రీ ఛానెల్ ను నిర్వహిస్తున్న దాని యజమాని కొత్త జయపాల్ రెడ్డి మానకొండూర్ ఎమ్మెల్యే తో ఉన్న రాజకీయ పరమైన విభేదాలను దృష్టిలో పెట్టుకొని సొంత ఛానెల్ మైత్రీలో తప్పుడు కథనాలను ప్రసారం చేయిస్తున్నారని వారు ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గంలోనే కాకుండా బయటి జిల్లాల్లో జరిగిన సంఘటనలు సైతం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లికి ఆపాదిస్తూ వారి ప్రతిష్టను దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలను ప్రసారం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తే చట్టప్రకారం శిక్షణ అనుభవించాల్సిందేనని, అది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలైనా, ఇతర పార్టీలకు చెందిన వారైనా ఒకటేనని, చట్టం తన పని తాను చేసుకు పోతుందని, ఇందులో ఎవరి జోక్యం ఉండకూడదన్నారు. అయితే ఇటీవల మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన ఓ కార్యకర్త తప్పుడు పనికి పాల్పడి నట్టుగా ఆరోపణలు రాగా, దాన్ని ఎమ్మెల్యే కు ఆపాదిస్తూ తప్పుడు కథనాలను మైత్రీ చానెల్ లో ప్రసారం చేశారని, అలాగే వరంగల్ జిల్లాలో సీఐ రవికుమార్ అనైతిక చర్యలకు పాల్పడ్డారనే అభియోగంపై అక్కడి పోలీసు కేసు నమోదు చేసి విచారణ జరుపుతుండగా, సదరు సీఐ రవికుమార్ తో మానకొండూర్ ఎమ్మెల్యే కు ఎటువంటి పరిచయం,సంబంధాలు లేనప్పటికీ ఆయన చేసిన తప్పిదాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణతో ముడిపెట్టి మసిబూసి మారేదు కాయ చేసే ప్రయత్నం చేశారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విధమైన అవాస్తవాలను, తప్పుడు కథనాలను మైత్రీ చానెల్ లో తప్పుడు కథనాలు ప్రసారం చేయడం వల్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గౌరవానికి, ప్రతిష్టకు భంగం వాటిల్లుతోందని వారు పేర్కొన్నారు. ఈ తప్పుడు కథనాలు చూసి కవ్వంపల్లి కుటుంబ సభ్యులు కూడా ఆవేదనకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని దళితుల అభ్యున్నతి కోసం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ త్రికరణ శుద్ధిగా కృషి చేస్తున్నారని, అందులో భాగంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారని దళిత నాయకులు పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో గాయత్రి విద్యార్థినుల ప్రతిభ



**పెద్దపల్లి, అక్టోబర్ 26(నినాదం న్యూస్):**
తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ కి చెందిన అల్లెంకి మహాలక్ష్మి 9వ, పడాల హాసిని 9 వ,మరియు ఎ.లాస్య ప్రియ 8వ, తరగతుల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ కేవలం చదువే కాకుండా ఆటల్లో కూడా ప్రతిభ చూపిస్తూ ముందు ముందు మరెన్నో పతకాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు తద్వారా మన జిల్లా కు గొప్ప పేరు తీసుకరావాలని వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, కృషి చేసిన పి.ఇ.టి. స్రవంతి లను అభినందించారు. విద్యార్థుల లక్ష్య సాధన దిశలో గాయత్రి విద్యా సంస్థల యాజమాన్యం సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్ పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

**-రామగుండం సీపీ శ్రీనివాస్**



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్26(నినాదం న్యూస్):**
రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గోదావరిఖని సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారి సహకారంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో రక్తదానం శిబిరం నిర్వహించారు. పోలీసులతో పాటు, స్థానిక యువకులు 200 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాని ముఖ్య అతిధిగా హాజరైన రామగుండం సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ అమరవీర జవానులను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుండి 31 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చున్నారు. రక్తదానం చేసినవారిని సీపీ అభినందించారు. వారికి సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ రమేష్ గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాదరావు, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, మంథని సిఐ రాజు, గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## సంస్మరణ సభ కరపత్రం, పోస్టర్ ఆవిష్కరణ



**పెద్దపల్లి అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
పౌరహక్కుల నేత, ప్రజాస్వామిక వాది,ఆదివాసీల గొంతు కైన ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబా సంస్కరణ సభ కరపత్రం, పోస్టర్ ను స్థానిక అమర వీరుల స్తూపం వద్ద శనివారం ఆవిష్కరించారు. అనంతరం పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన్ కుమారస్వామి తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్, గుమ్మడి కొమురయ్య లు మాట్లాడుతూ సాయిబాబాను ప్రభుత్వమే హత్య చేసిందని,90% వైకల్యం,పక్షవాతం ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. దళితుల పక్షాన,పీడిత ప్రజల పక్షాన,ఆదివాసీలపై ప్రభుత్వాల దమనకాండకు,ఆపరేషన్ గ్రీన్ హంట్ కు వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రభుత్వం కక్ష కట్టిందని ఆరోపించారు. ఈ సంస్మరణ సభకు ప్రజలు,ప్రజస్వామిక వాదులు, మేధావులు,విద్యార్థులు,రైతులు,రైతు కూలీలు,మహిళా,యువజన శ్రామిక వర్గ ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలోపౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు,శ్రీపతి రాజగోపాల్,పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నారావినోద్,పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు బండారి రాజలింగు,విప్లవరచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్,బాలసాని రాజయ్య,తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్,గాండ్ల మల్లేశం,తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు,పోగుల శేఖర్,ప్రజా సంఘాల నాయకులు పులిపాక రవీందర్,కొంతం రాజు, కొత్తూరీ రవీందర్ బూపెల్లి సుధాకర్, బండి శంకర్ గౌడ్,గుల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణలపై ఎస్ఐ సోనియా సస్పెన్షన్

**-ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు**

**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 26(నినాదం న్యూస్):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అప్పస్ సోనియాను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఎస్.హెచ్.ఓ గా విధులు నిర్వహిస్తున్న సమయం లో ఓ కేసులో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ వ్యవహారం పై ఉన్నతాధికారుల నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కాగజ్నగర్ అక్టోబర్ 25 (నినాదం న్యూస్) :**
ఐ ఎన్ టి యు సి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కాగజ్నగర్ విద్యుత్ శాఖ డివిసన్ కార్యాలయం ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి అనుబంధ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) జిల్లా కార్యదర్శి ఎమ్మాజీ సతీష్ కుమార్ మాట్లాడుతూ సంఘం ఏర్పాటు చేసి 70 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 70 సంవత్సరాల నుండి ఆల్ ఇండియా ఐ ఎన్ టి యు సి అధ్యక్షుడు గా డా.జి సంజీవరెడ్డి గారు ఒక్కరే అధ్యక్షునిగా ఉండటం గర్వకారణం అని తెలిపారు.

## తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దపల్లి, అక్టోబర్26(నినాదం న్యూస్):**
తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం పెద్దపల్లి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ లో జరిగిన ఎన్నికలో మంథని అర్ డీ.ఓ కార్యాలయ పరిపాలన అధికారి తూమ్ రవీందర్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షునిగా అలివెని, ఉపాధ్యక్షులుగా కుమార్, సాజిద్ అలీ, అంజలి, కార్యదర్శిగా బ్రాహ్మేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, మధు , అనుషా, కోశాధికారిగా కరుణాకర్, నిర్వహణ, ప్రచార, కార్యాలయ, సంస్కృతిక, క్రీడల కార్యదర్శులుగా సురేష్, శ్రీకాంత్, శంకర్, తిరుమల్, మధుబాబు, సభ్యులుగా గంగా ప్రణవ్, సతీష్, రాఘవేంద్ర చారి, సిందురి లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీరామ్ రెడ్డి, సహాయ అధికారిగా రామారావులు వ్యవహరించారు. పెద్దపల్లి జిల్లా సంఘం ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా టీ జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు పది లక్షల మంది ప్రభుత్వ విభాగాల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్నారని, అందరి ప్రయోజనాల కోసమే తాము శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, విష్ణు, బొంకూరి శంకర్, రమేష్, సమర్ సేన్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రమాద రైతు కూలీలకు అండగా ఉంటాం

**-ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్**



**గోదావరిఖని అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
అంతర్గం మండల కేంద్రానికి చెందిన 6 గురు రైతు కూలీలు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి తీవ్ర గాయలైన విషయం తెలుసుకొని స్థానిక గోదావరిఖని మమతా హాస్పిటల్ లో చేర్పించి తమ సొంత ఖర్చులతో వారికి వైద్యం చేయించడం జరిగింది. అనంతరం రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ హాస్పిటల్ కి వెళ్లి గాయాలు అయిన వారిని పరామర్శించి వారికి అన్ని విధాలుగా ఎమ్మెల్యే తోడుగా ఉంటారని వారికి ధైర్యం చెప్పడం జరిగింది. అనంతరం వైద్య సిబ్బంది తో మాట్లాడి వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని వారికి సరైన వైద్యం అందించాలని కోరడం జరిగింది. గాయలైన రైతు కూలీలు చిలుక లక్ష్మీ, కొమురక్కా,చిలుక సరిత, పబ్బ ఉమా,చిలుక రాజమణి పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ భూనిర్వాసితుల వంటావార్పుకి బిఆర్ఎస్ మద్దతు

**గోదావరిఖని అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
ఎన్టీపీసీ భూనిర్వాసితులు 28 తేది సోమవారం రోజున నిర్వహిస్తున్నా వంట వార్పు కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ పార్టీ మద్దతు తెలుపుతున్నామని మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు . ఎన్టీపీసి నవరత్న కంపెనీ అని పేరుకు మాత్రమే దీపం కింద చీకటి అనే చందంగా భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు ఏమాత్రం న్యాయం చేయడం లేదన్నారు. కోట్లాది నిధులు వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు కానీ నిర్వాసితుల నివాసం ఉన్న గ్రామాల్లో మాత్రం కనీస మౌలిక వసతులు కలిపించడం లేదన్నారు. ఉద్యమం తో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బి ఆర్ ఎస్ పార్టీ మద్దతు ప్రకటించడం తో పాటు భూనిర్వాసితులకు అండగా బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు ఉద్యమకారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యమం లో రామగుండం కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి



అభిషేక్ రావు, కార్పోరేటర్ శ్రీనివాస్, శంకర్, దాసరి అనంద్, పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలి

**-తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్**

**బెల్లంపల్లి అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కన్నాల జాతీయ రహదారి ప్రక్కన బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి క్వార్టర్ ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు,మంచిర్యాల జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి వేణుగోపాల్ శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం కోర్టు ఆవరణలో ఆయన మొక్కలు నాటరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బెల్లంపల్లి కోర్టు ఆవరణలో కోర్టు నిర్మాణం పూర్తయ్యేసరికి విరివిగా మొక్కలు నాటి పెంచాలని,నేటి సమాజంలో ఒకరికి 7మొక్కలు ఉండాల్సిన పరిస్థితులలో 7వందల మొక్కలు ఉన్నాయని అందుకే ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి,కోర్టు ఆవరణలో సైతం పచ్చదనం మెండుగా ఉండేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి



ముకేశ్,పలువురు జిల్లా న్యాయవాదులు,రెవెన్యూ,పోలీస్,బెల్లంపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈవో హనుమంతు

**సిర్పూర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
సిర్పూర్ నియోజకవర్గం కౌటాల మండల కేంద్రము లోని ప్రాథమిక పాఠశాలను శనివారం మండల విద్యాదికారి జీ .హనుమంతు సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం మెను ప్రకారం వడ్డించాలని సూచించారు. కౌటాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మోడల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయగా మండల విద్యాధికారి జి. హనుమంతు శనివారం ప్రారంభించారు. రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా ఇన్చార్జి అధికారి జెన్నిఫర్ మేడం హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జీ.హనుమంతు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయం ఏర్పాటుచేసిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను మండల విద్యాధికారి హనుమంతు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీజీ హెచ్ఎంలు నారాయణ సింగ్, నానాజీ ఉపాధ్యాయులు సిహెచ్ గణపతి, ఏం. ఎల్. రాజు, యు .ఎన్. చారి, ఎన్ .శ్రీనివాస్, హిందూ



రావు భీమ్రావు, రూమ్ టు రీడ్ కోఆర్డినేటర్ సంపత్, సి సి ఓ లు, సిఆర్పిలు పాల్గొన్నారు.

## తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా సాంస్కృతిక కార్యదర్శిగా రావుల తిరుమల్



**మంథని అక్టోబర్ 26 (నినాదం న్యూస్):**
తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం పెద్దపల్లి జిల్లా సాంస్కృతిక కార్యదర్శిగా మంథని కి చెందిన రావుల తిరుమల్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలో మంథని బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పని చేస్తున్న తిరుమల్ జిల్లా కార్యవర్గంలో చోటు సాధించారు. వీరికి టీ జీ ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు నియామక పత్రాలు అందజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు రవీందర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సాంస్కృతిక కార్యదర్శిగా ఎన్నికైన తిరుమల్ ను పలువురు అభినందించారు.

## అభివృద్ధే ధ్యేయంగా 19వ వార్డు

**-కౌన్సిలర్ బెక్కం అంజమ్మ రూ.2 లక్షల విరాళం**



**పెద్దపల్లి రూరల్ అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :**
పట్టణంలోని 19 వ వార్డుకు చెందిన కౌన్సిలర్ బెక్కం అంజమ్మ శనివారం వార్డు అభివృద్ధి కొరకు రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చి ఔన్నత్యాన్ని చాటుకున్నారు. కౌన్సిలర్ గా గెలుపొందినప్పటి నుండి వార్డు అభివృద్ధి కొరకు మున్సిపల్ జనరల్ ఫండ్,టీ.ఎఫ్.ఐ.డి.సి, మున్సిపల్ పట్టణ ప్రగతి ఫండ్,ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రూ.3 కోట్ల నిధులతో కాలనిలో సీసీ రోడ్లు,మురికి కాలువల నిర్మాణాలు చేసి అభివృద్ధిలో ముందున్నారు. అయితే కాలనీ వాసులు ఒడ్డేపల్లి రాజు,బొంకూరి కవితలు తెలుపుతూ,మునుపెన్నడూ ఏ కౌన్సిలర్ కూడా ఇలాంటి అభివృద్ధి పనులు చేయలేదని వారు తెలిపారు. .బండారికుంట లోని గణేష్ మండపానికి చెందిన పహారి గోడ,బోరింగ్ కొరకు తన సొంత డబ్బులు రూ 2లక్షలు విరాళం ప్రకటించారు. విరాళం ప్రకటించినందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. బెక్కం అంజమ్మ మాట్లాడుతూ,నా పై నమ్మకంతో నాకు ఓట్లు వేసి గెలిపించారని అందుకే కాలనిలో అభివృద్ధి కొరకు ముందు ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి బాలయ్య,ఆరేళ్ల కోమల, బొంకూరి నవీన్,సోమిడి పద్మ,మాచర్ల రాజేశ్వరి,కనకం వరలక్ష్మి,రామకృష్ణ,సుద్దాల భూదమ్మ కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణల కింద నలుగురు పోలీస్ అధికారులు సస్పెన్షన్

**కాగజ్ నగర్ అక్టోబర్ 25 (నినాదం న్యూస్ ) :**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో గతంలో ఎస్సైగా విధులు నిర్వహించిన ఎస్సై సోనియా , అదే పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నఏఎస్ఐ మను .ఇద్దరు హెడ్ కానిస్టేబుల్ రమేష్ లను సస్పెండ్ మల్టీ జోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించిన సోనియా ఒక కేసు విషయంలో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఐపిఎస్ గారు విచారణ జరిపి ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా మల్టీ జోన్-1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ గారు ఉత్తర్వులు జారీ చేశారు.

## 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

**మంచిర్యాల టౌన్ అక్టోబర్ 26 (నినాదం న్యూస్ ):**
ఆగస్టు-2024 సెక్షన్ కొరకు ఎన్.సి.వి.టి. ప్యాటన్ క్రింద వివిధ ఇంజనీరింగ్, నాన్ -ఇంజనీరింగ్ ట్రేడ్లలో శిక్షణ పొందేందుకు అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మందమర్రి ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపల్ జి.దేవానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి ప్రభుత్వ ఐ.టి.ఐ., ఎ.టి.సి.లలో 7వ దఫా అడ్మిషన్లకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అభ్యర్థులు https://iti.telangana.gov.in వెబ్సైట్ ద్వారా తమ నిజ ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్లైన్లో దరఖాస్తు చేసే సమయంలో పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, పుట్టినతేది ఇతర వివరాలను ఎస్.ఎస్.సి. మెమో ఆధారంగా నమోదు చేయాలని, ఒకసారి ఆన్లైన్ దరఖాస్తు చేసి సీటు పొందిన తరువాత ఎలాంటి మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదని, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ అడ్రస్లు సంబంధిత అభ్యర్థివి మాత్రమే నమోదు చేయాలని తెలిపారు. డ్రాఫ్ట్ మెన్ సివిల్ ట్రేడ్లో 13 ఖాళీలు, బేసిక్ డిసైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్-ఎ.టి.సి.) ట్రేడ్లో 14 ఖాళీలు ఉన్నాయన్నారు.

# మెదక్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ప్రతినిధి అక్టోబర్ 26( నినాదం న్యూస్)** : మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి శాఖల వారీగా మౌలిక వసతుల కల్పన పై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెదక్ నియోజకవర్గ అభివృద్ధిపరిచేందుకు శాఖల వారీగా ప్రతిపాదనలు తయారు చేయడంపై ఇరిగేషన్, ఆర్ అండ్ బి, దేవాదాయ, వైద్య, మున్సిపాలిటీ, టూరిజం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో నిలపాలని మెదక్ జిల్లా శాసనసభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారని జిల్లా అభివృద్ధిపై శాఖల వారీగా ప్రతిపాదనలు తయారుచేసి అందించిన పక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు దృష్టికి తీసుకుని వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సూచించారని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమై నియోజకవర్గ అభివృద్ధిపై ప్రతిపాదన సిద్ధం చేసే దిశగా చర్చిస్తున్నట్లు చెప్పారు. మెదక్ ఎంట్రన్స్ లో వెల్కమ్ బోర్డు సరికొత్త ఆలోచనలతో మెదక్ అంటే మెతుకు సీమ బియ్యం గింజ బ్యాక్ గ్రౌండ్ వచ్చే విధంగా చూపరులను ఆకట్టుకునే విధంగా తయారు చేయించాలన్నారు, యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఈ సెంటర్లో కుక్కల,కోతులజంతు జనన నియంత్రణ చర్యలు చేపట్టడం, వైద్య కళాశాల ప్రాంగణంలో హాస్పటల్, స్టాఫ్ క్వార్టర్స్ సిబ్బంది వసతి గృహాలు, ఎస్టిమేట్స్ సిద్ధం చేయడం, టూరిజం అభివృద్ధి ఏడుపాయల వనదుర్గ దేవాలయానికి సంబంధించి రోడ్డు వైడింగ్ ,, హెూటల్ కం టూరిజం గెస్ట్ హౌస్, మెయిన్ రోడ్ నుంచి టెంపుల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు,మెదక్ చర్చి, సంబంధించి వచ్చే డిసెంబర్ నాటికి చర్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని సెలబ్రేషన్స్ నిర్వహించడం జరుగుతుందని చర్చి పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ పరంగా మెదక్ చర్చి ప్రాంగణం లో సభ్యులతో సమన్వయంతో అభివృద్ధికి ఎస్టిమేట్స్ తయారు చేయాలన్నారు. మెదక్ బస్టాండ్ మోడ్రనైజేషన్, సరికొత్త ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, మున్సిపాలిటీ పరిధిలో చిల్డ్రన్స్ పార్క్, ఇరిగేషన్ చెరువులు మినీ ట్యాంక్ బండ్స్, మెదక్ పోర్ట్ అభివృద్ధి, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి బ్రిడ్జెస్, యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసే దిశగా నివేదిక తయారు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనతో జిల్లా అభివృద్ధి ఇతర జిల్లాలతో పోటీ తత్వంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి పంచాయతీరాజ్, ఇరిగేషన్ ,దేవాదాయ వైద్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నినాదం క్లిక్

# పడితే ప్రమాదమే..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం నుంచి మేడారం వెళ్లే మెయిన్ రోడ్ లో కొర్లకుంట సమీపంలోని మూలమలుపు వద్ద నారవేప చెట్టు మొదువారి ప్రమాదకరంగా మారింది. మేడారం వెళ్లే రూట్ లో నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. అయితే మోడువారిన చెట్టు రోడ్డు వైపు వంగి ఉండడంతో ప్రమాదకంగా మారింది. ప్రయాణికులు ప్రమాదపుటంచన ప్రయాణం చేస్తున్నారు. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు స్పందించి మోడువారిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు..

– అజ్మీరా దాకు నాయక్
జయశంకర్ భూపాలపల్లి, బ్యూరో నినాదం న్యూస్

# మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- ఎమెల్సీ శంభీపూర్ రాజు



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ముందుకు వెళు తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు . కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘ సభ్యులు శనివారం శంభిపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు భరోసా ఇచ్చారు.

# విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దు

- మత్తులో పడితే జీవితం నాశనం
- యాంటీ నార్కోటిక్ డీఎస్పీ హరీష్ చంద్ర రెడ్డి
- వివేకానంద కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన
- బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచన




**చేవెళ్ల అక్టోబర్ 26( నినాదం న్యూస్) :** విద్యార్థులు మాయదారి మత్తులో పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ నార్కోటిక్ డీఎస్పీ సి. హరీష్ చంద్రా రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అధ్యర్యంలో వివేకానంద జూనియర్,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి. జైపాల్ రెడ్డి అధ్యక్షతన యాంటి డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ నార్కోటిక్ డీఎస్పీ హరీష్ చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. మాదక ద్రవ్యాల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలన్నారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు. యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని, సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలియజే శారు. విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదర భావంతో మెలగాలని, సత్సంబం ధాలు ఏర్పరచుకోవాలని తెలిపారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన రహదారి నియమ నిబంధనలను విద్యార్థులకు వివరణాత్మ కంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాస్ రావు, గోపి , కళాశాల డైరెక్టర్ సి. ఇంద్రసేనా రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి ఆరోగ్య పెన్నిధి : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- రూ. 3,40,00 విలువగల ఎల్ఓసీ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నినాదం న్యూస్) :** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో 125 – గాజులరామరం డివిజన్ కి చెందిన రఫత్ ఉన్నిసా బేగం, 126 – జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీ కి చెందిన వెంకట దీక్షిత, కొంపల్లి మున్సిపాలిటీ కి చెందిన పి.దేవేందర్ యాదవ్ ల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సమాచారం తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రఫాత్ ఉన్నిసా బేగం (రూ.1,00,000/-), వెంకట దీక్షిత (రూ.40,000/-) దేవేందర్ యాదవ్ ( రూ.2,00,000)లకు ఎల్ఓసీ మంజూరు చేయించి శనివారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు.

నినాదం సినిమా

# హాలీవుడ్ హీరోలకన్నా ధీటుగా మహేష్ బాబు

**రూ.1500 కోట్ల భారీ బడ్జెట్‌తో సినిమా**



దర్శక ధీరుడు రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబును హీరోగా పెట్టి పాన్ వరల్డ్ సినిమా తీయబోతున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై డాక్టర్ కె.ఎల్.నారాయణ, ఎస్.గోపాల్ రెడ్డి దీన్ని రూ.1500 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలను తలదన్నే రీతిలో రాజమౌళి ఈ సినిమాను తీయనున్నట్లు చెబుతున్నారు. అందుకే మహేష్ బాబును హాలీవుడ్ హీరోలకన్నా ధీటుగా తయారుచేస్తున్నారు. దీనిపై ఇప్పటికే మహేష్ బాబు శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం రాజమౌళి ఏఐ నేర్చుకుంటున్నారు. తాను నేర్చుకుంటున్న విషయాలను తన టీంతో పంచుకుంటున్నారు. ఆ రెండు సినిమాలు బాగా నచ్చాయి ఏ దర్శకుడికైనా ఒక హీరోకు సంబంధించిన సినిమాల్లో అన్నీ నచ్చాలనే నిబంధన లేదు. కొన్ని సినిమాలు కచ్చితంగా నచ్చుతాయి. అలా రాజమౌళికి మహేష్ బాబు సినిమాల్లో బాగా నచ్చినవి రెండు ఉన్నాయి. అవి ఒక్కడు, పోకిరి. ఈ రెండు సినిమాల్లో మహేష్ బాబు తనను తాను కొత్తగా చూపించుకున్నారని, ఈ సినిమాల్లో కొత్తగా కనిపించాడని ఓ ఇంటర్వ్యూలో రాజమౌళి చెప్పారు. వీటిల్లో సరికొత్త మహేష్ బాబును చూశానని, ఏ పాత్రనైనా అవలీలగా పోషింగల సత్తా మహేష్ బాబుకు ఉందని ఆయన కొనియాడారు. "650 రోజుల నుంచి ఒకే థియేటర్‌లో ఆడుతున్న జూనియర్ ఎన్టీఆర్ సినిమా" సంక్రాంతికి ప్రెస్ మీట్ మహేష్ బాబు అభిమానులు రాజమౌళి ఎటువంటి అప్ డేట్ ఇవ్వడంలేదంటూ విసుగ్గా ఉంటున్నారు. అయితే సంక్రాంతికి ప్రెస్ మీట్ పెట్టి సినిమాకు సంబంధించిన వివరాలు తెలియజేసే అవకాశం ఉందంటున్నారు. ఆఫ్రికన్ అడవుల్లో సినిమా తీయనున్నారని, ఫారెస్ట్ అడ్వెంచర్ గా సినిమా రూపుదిద్దుకోబోతోందని, ఇంతవరకు హాలీవుడ్ లో కూడా రానివిధంగా ఈ సినిమాను రాజమౌళి పట్టాలెక్కించబోతున్నారని తెలుస్తోంది. ఈ సినిమా విజయం సాధిస్తే మహేష్ బాబు హాలీవుడ్ హీరో అయినట్లేనని, ఇంగ్లిషు సినిమాలే చేస్తారని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. ఈ సినిమా తర్వాత మహేష్ బాబు ఎటువంటి నిర్ణయం తీసుకుంటాడా? అనేదే అత్యంత ఉత్కంఠగా సినీ పరిశ్రమలోను, అభిమానుల్లో నెలకొంది.


# మీకేంటీ బాధ

## బాడీ షేమింగ్‌పై మండిపడ్డ ఆలియాభట్



బాడీ షేమింగ్ ఫిల్మ్ ఇండస్ట్రీకి కొత్తేమీ కాదు. తరచూ ఎవరో ఒకరి మీద బాడీ షేమింగ్ కామెంట్స్ వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ క్యూటీ ఆలియాభట్ ఈ సమస్యను ఎదుర్కొంటోంది. ఆమెకు కాస్మొటిక్ సర్జరీ ఫెయిల్ అయిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ మధ్యన ఆమె నవ్వితే మూతి వంకర పోతుందని కొన్ని కామెంట్లు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఆమె మాట్లాడుతున్నప్పుడు కూడా ముఖం తేడాగా కనిపిస్తోందని కొంతమంది విమర్శలు చేస్తున్నారు. సోషల్ వీడియాలో తనను ట్రోల్ చేస్తున్న వారిపై ఆలియా మండిపడ్డారు. తన లుక్స్ గురించి కామెంట్ చేస్తున్న వారి కోసం ఆలియా ఓ పోస్ట్ పెట్టింది. "కాస్మెటిక్ కరెక్షన్ లేదా సర్జరీ చేయించుకునే ఎవరి గురించి మాట్లాడను, జడ్జ్ చేయను. మీ శరీరం, మీ ఇష్టం. కానీ దీనిపై నడుస్తున్న ట్రోలింగ్ హాస్యాస్పదంగా ఉంది. నేను చేయించుకున్న బొటాక్స్ ఫెయిల్ అయిందంటూ వీడియోలు వైరల్ అవుతున్నాయి. మీ అభిప్రాయం ప్రకారం, నేను వంకరగా నవ్వుతాను, మాట్లాడినప్పుడు వింతగా ఉంటాను. నా ముఖం ఒకవైపు పక్షవాతానికి గురైందని మాట్లాడుతున్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఇలాంటి వీడియోలు ఎలా చేస్తారు. ఇలాంటి కామెంట్స్ చేసేటప్పుడు దానికి వెనక ఏముంది. అసలేం జరిగింది అన్నది తెలుసుకోరా? ప్రతి వ్యక్తికి కొన్ని ఇష్టాలు, నిర్ణయాలు, సొంత ఛాయిస్‌లు ఉంటాయి. వాళ్లకు నచ్చినట్లు జీవితాన్ని సాగిస్తుంటారు. వాళ్ల వ్యక్తిగత జీవితంలోకి వెళ్లి భూతద్దం పెట్టి చూడటం 100 శాతం తప్పే. ఇతరుల వ్యక్తిగత జీవితాల గురించి మీకు ఎందుకు? అంటూ మండిపడింది. తాజాగా ఆమె నటించిన 'జిగ్రా' చిత్రం విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా అంతంత మాత్రంగా ప్రేక్షకాదరణ పొందింది.

# ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్‌లో పుష్ప2



ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'పుష్ప: ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదల రోజే ఈ సినిమా రికార్డులు సృష్టించనుంది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్ లో విడుదల చేయనున్నారు. తాజాగా ఈ విషయానికన మేకర్స్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఆరు భాషల్లో 11,500 స్క్రీన్స్ లో దీన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు భారీగా ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. ఇండియాలో 6,500.. ఓవర్సీస్‌లో 5000 స్క్రీన్స్ లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటివరకు ఏ ఇండియన్ సినిమా ఈ స్థాయిలో విడుదల కాలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ సినిమాగా 'పుష్ప2' రికార్డు సృష్టించనుండడం ఖాయమేనని అంటున్నారు. ఈ చిత్రం కలెక్షన్లలోనూ సరికొత్త రికార్డులు తన ఖాతాలో వేసుకుంటుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. దీంతో ఫ్యాన్ ఆనందంలో మునిగి తేలుతున్నారు. అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్నా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ సినిమాను నవీన్ ఎర్నేని, రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




# ఈ స్కీమ్ గురించి మీకు తెలుసా?

- ఇందులో ఇన్వెస్ట్ చేస్తే ఐదేళ్లలో రూ.12 లక్షల వడ్డీ..!

గత కొద్ది రోజులుగా స్టాక్ మార్కెట్ భారీ పతనం కారణంగా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. చాలా మంది పెట్టుబడిదారులు గత 6 నెలలు లేదా 1 సంవత్సరంలో సంపాదించిన దాన్ని కోల్పోయారని చెబుతున్నారు. గత నెల రోజుల్లో ఇన్వెస్టర్లు రూ.40 లక్షల కోట్ల మేర నష్టపోయారు. అటువంటి పరిస్థితిలో చాలా మంది ఇప్పుడు తక్కువ రిస్క్ ఉన్న ప్రదేశాలలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నారు. మీరు కూడా ఇలాంటి పథకంలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నట్లయితే, లక్షల రూపాయలు సంపాదించగల ప్రభుత్వ పథకం గురించి తెలుసుకుందాం. ఈ పథకం చిన్న పొదుపు పథకాలకు లింకై ఉంది. అలాగే పోస్ట్ ఆఫీస్ కింద నిర్వహిస్తున్నారు. ఈ పథకం కింద కేవలం వడ్డీ ద్వారానే రూ.12 లక్షలకు పైగా ఆదాయం లభిస్తుంది. అలాగే రిస్క్ చాలా తక్కువగా ఉంటుంది. అదే సమయంలో ఈ పథకం కింద పన్ను ప్రయోజనం ప్రయోజనం కూడా ఉంటుంది. ఇందులో పెట్టుబడి గరిష్ట పరిమితి రూ.30 లక్షలు. సీనియర్ సిటిజన్ ఎవరైనా ఈ పథకంలో పెట్టుబడి పెట్టవచ్చు.




సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ గురించి మాట్లాడినట్లయితే.. దీని కింద మీరు లక్షల రూపాయలు సంపాదించవచ్చు. ఎలాగో తెలుసుకుందాం? పోస్ట్ ఆఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ అనేది డిపాజిట్ స్కీమ్. ఇందులో 5 సంవత్సరాల పాటు నిర్ణీత మొత్తం పెట్టుబడి పెడతారు. సీనియర్ సిటిజన్లు ఈ పథకంలో గరిష్టంగా రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టవచ్చు. కనీస పెట్టుబడి పరిమితి రూ.1000. ప్రస్తుతం ఈ పథకంపై 8.2 శాతం వార్షిక వడ్డీ ఉంటుంది. అయితే, వడ్డీ త్రైమాసిక ప్రాతిపదికన సవరిస్తుంటారు.

**రూ.12 లక్షలపై వడ్డీని ఎలా పొందవచ్చు?**

మీరు ఈ పథకంలో సంవత్సరానికి రూ.30 లక్షలు పెట్టుబడి పెడితే, 5 సంవత్సరాలలో 8.2% చొప్పున రూ.12,30,000 వడ్డీని పొందుతారు. ప్రతి త్రైమాసికానికి రూ.61,500 వడ్డీ జమ అవుతుంది. అటువంటి పరిస్థితిలో 5 సంవత్సరాల తర్వాత మీరు మెచ్యూరిటీ మొత్తంగా రూ. 42 లక్షల 30 వేలు పొందుతారు. మీరు ఈ పథకంలో 5 సంవత్సరాల పాటు రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తే, ప్రస్తుత వడ్డీ రేటు 8.2 శాతం ప్రకారం, మీకు వడ్డీ నుండి మాత్రమే 5 సంవత్సరాలలో రూ. 6 లక్షల 15 వేలు పొందుతారు. త్రైమాసిక ప్రాతిపదికన వడ్డీని లెక్కిస్తే, ప్రతి మూడు నెలలకు రూ.30,750 వడ్డీ అందుతుంది. ఈ విధంగా రూ.15 లక్షలు, వడ్డీ మొత్తం కలిపి మొత్తం రూ.21 లక్షల 15 వేలు మెచ్యూరిటీ మొత్తంగా అందుతుంది.

# ధనత్రయోదశి రోజున బంగారం కొనాల్సిందేనా..?

- వెండి, బంగారాల్లో మీ చాయిస్ ఏంటి?



ధనత్రయోదశి సందర్భంగా బంగారం, వెండిలో దేనిని కొనుగోలు చేయాలనే విషయంలో కొంత సందేహం తలెత్తుతుంది. ఈ విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవడం అవసరం. ఈ రెండు లోహాలు వేటికవే ప్రత్యేకమైనవి. ముఖ్యంగా దీపావళి పండుగకు ముందు బంగారం కొనుగోలు చేసి లక్ష్మీ పూజ చేసుకోవడం ఎన్నో ఏళ్ల ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. బంగారానికి స్థిరత్వం ఎక్కువ, అలాగే సాంస్కృతిక నేపథ్యం కూడా ఉంది. తర్వాత స్థానంలో వెండికి డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో బంగారం, వెండి కొనుగోలు విషయంలో ఏది బెస్ట్? అనేది ఓ సారి తెలుసుకుందాం.

**బంగారం :**

భారతీయులందరూ ఎంతో ఇష్టపడే లోహం బంగారం. పూర్వకాలం నుంచి దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. బంగారం కలిగి ఉండటాన్ని స్టేటస్ కు చిహ్నంలా భావిస్తారు. ముఖ్యంగా పండుగల, శుభకార్యాలు, ఇతర ముఖ్య మైన రోజుల్లో బంగారు ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఒక రకంగా చెప్పాలంటే బంగారం లేకుండా పండగలు, శుభకార్యాలు జరగవు. బంగారం విలువ ఎప్పుడూ పెరుగుతూనే ఉంటుంది. దీనిలో పెట్టుబడి పెట్టడం అత్యంత సురక్షిత మార్గం. ముఖ్యంగా మహిళలు తమ పొదుపును బంగారంపై ఇన్వెస్ట్ చేస్తారు. దీర్ఘకాలంలో మంచి రాబడిని అందిస్తుంది. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో బంగారంపై పెట్టుబడులను అత్యంత మేలైన విధానంగా ప్రజలు భావిస్తున్నారు. బంగారంపై పెట్టబడులు పెట్టడం చాలా సులభం. దుకాణాల్లో ఆభరణాలు, నాణేలుగా కొనుగోలు చేయవచ్చు. లేకపోతే ఈటీఎఫ్ (మ్యూచువల్ ఫండ్స్)లలో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఆన్ లైన్ విధానంలో కొనుగోలు జరపవచ్చు. ఆర్థిక మాంద్యం సమయంలోనూ బంగారం ధరలకు ఇబ్బంది ఉండదు. అత్యవసర సమయంలో బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే అవకాశం ఉంటుంది. బంగారు ఆభరణాలకు ఎంతో విలువ ఉంటుంది. వీటిని ధరించడం వల్ల అందం పెరుగుతుందని భావిస్తారు. అలాగే వీటి వినియోగం కూడా మన సంప్రదాయంలో చాలా ముఖ్యం.

వెండి : బంగారం తర్వాత ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే లోహం వెండి. దీని ధర బంగారంతో పోల్చితే తక్కువగా ఉంటుంది. కాబట్టి తక్కువ పెట్టుబడితో ఎక్కువ వెండిని కొనుగోలు చేసుకోవచ్చు. వెండిపై ధర పెరుగుదల బంగారంతో పోల్చితే తక్కువగానే ఉంటుంది. వేల సంవత్సరాలుగా ఈ విషయంలో బంగారం ఆదిపత్యం. అయితే బుల్ మార్కెట్‌లలో వెండి చాలా వేగంగా పెరుగుతోంది. వెండితో తయారు చేసిన ఆభరణాలను అలంకరణ కోసం ఉపయోగిస్తారు. దీని మెరిసే రూపం ఎంతో ఆకట్టకుంటుంది. మంచి నాణ్యమైన, అందమైన డిజైన్లలో వెండి ఆభరణాలు ఆకట్టుకుంటున్నాయి.కొన్ని పండుగల సమయంలో వెండిని తప్పనిసరిగా ధరిస్తారు. ఈ ఆచారం సంప్రదాయంగా వస్తోంది. బంగారం మాదిరిగానే ధన్‌తేరాస్‌లో వెండిని కొనుగోలు చేయడం వల్ల జీవితం చక్కగా సాగుతుందని నమ్మికం.

**ఏది మంచిదంటే..?**

సాధారణంగా బంగారం కొనుగోలుకే ప్రజలందరూ మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఎందుకంటే అత్యంత సురక్షిత పెట్టుబడి మార్గాలలో బంగారం ముందు వరుసలో ఉంటుంది. అయినప్పటికి వెండిని కొనుగోలు చేయడం కూడా మంచిదే.